అవతారమూర్తి

జిల్లెళ్ళమూడి అమ్మ





సద్గురు శివశ్రీ
కందుకూరి శివానందమూర్తి


దైవం 'సద్గురు' రూపేణ...

అవతారమూర్తి

జిల్లెళ్ళమూడి అమ్మ



రచన

సద్గురు కందుకూరి శివానందమూర్తి

విశాఖపట్టణం

ప్రథమ ముద్రణ : డిసెంబరు, 2015

కాపీలు : 1000

ప్రతులకు : **శ్రీ విశ్వజననీ పరిషత్**
జిల్లెళ్ళమూడి
బాపట్ల మండలం, గుంటూరుజిల్లా.
ఫోన్ : 08643-227324

వెల : రూ. **50/-**

ముద్రణ : శ్రీ లక్ష్మీ గణపతి ఆర్ట్ ప్రింటర్స్
2/4 బ్రాడీపేట, గుంటూరు-2.
ఫోన్ : 0863-2235036.

ఈ గ్రంథ ప్రచురణ - మా ఉద్దేశ్యము

పరమ పూజ్యులు శివశ్రీ సద్గురు కందుకూరి శివానందమూర్తిగారు జగమెఱిగిన బ్రాహ్మణులు. వారికి రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాలలోనూ, విదేశాలలో కూడా శిష్యపరంపర ఉన్నది. ఆధ్యాత్మిక, వాస్తు, యోగ, మంత్ర శాస్త్రాలలో పరిణత ప్రజ్ఞ కలిగినవారు. ఎంత వినయభూషణులో వారి నెఱిగిన, చూచినవారికి తెలుసు.

1975లోనే అమ్మ వద్దకు తమ శ్రీమతితో కలిసి రావాలని భావించారు. కారణాంతరాల వల్ల అప్పుడు వారి శ్రీమతిని పంపించారు. ఆ తర్వాత 1975లోనే లక్షమందికి ఒకే పంక్తిన అన్నం పెట్టిన అమ్మ కోటిమందికి దర్శనం ప్రసాదించే యాత్రలలో ఒకసారి వరంగల్‌లో అమ్మ సద్గురు శివానందమూర్తిగారి ఇంటికి వెళ్ళింది. వారు మహాశైవ పీఠాధిపతులు. జ్ఞానయోగి, కర్మయోగి. అమ్మ ఆత్మబంధువులా వారి ఇల్లంతా కలయ తిరిగింది. వారి సహధర్మచారిణితో "అమ్మా! అతను నీ భర్త అనేది ఒక పాత్ర, నిజానికి అతను 'లోకబంధువు'. అంతా అలా పిలవండి" అన్నది. శ్రీ శివానందమూర్తి నిండుమనస్సుతో పాలు పండ్లు అమ్మకు నివేదించారు. అమ్మ వాటిని చూచింది, తాకింది. "ఏదో ఒకటి తీసుకోండి" అని వారు అభ్యర్థించారు. 'ఒకటేమిటి ? అంతా తీసుకుంటాను" అన్నది. ఆ మాటలకు అర్థం ఆ తల్లీ బిడ్డలిద్దరికే తెలియాలి. శివానందమూర్తిగారు అమ్మను భౌతికంగా చూచింది ఆ రెండుసార్లే. ముందుగా అమ్మ వారింటికి వెళ్ళింది. తర్వాత అమ్మ హైదరాబాదుకు అనారోగ్యంతో శ్రీరాజగోపాలాచారిగారి ఇంటికి వచ్చినప్పుడు 1980లో దంపతులిద్దరూ చూచారు. వచ్చి అమ్మవారి చెయ్యి పట్టుకుంది. వారు అమ్మనాడి చూచారు. "అమ్మా! ఆరోగ్యం ఏలా ఉంది ?" అని కుశలప్రశ్నలు వేశారు. అమ్మ నవ్వింది. వారు అమ్మతో "ఒక ప్రార్థన మీరు ఉండాలి – ఎంతకాలం వీలవుతుందో, మీకు ఎంత శ్రమ అయినప్పటికీ, ఈ శరీరంలో ఉండటం ఎంత బాధాకరమయినప్పటికీ, లోకం ముందు మీకుండేటువంటి దయముందు, మీకు ఉండే బాధ అంత గొప్పది కాదు. వీలైనంత కాలం ఉండాలి" అన్నారు.

అప్పుడు అమ్మ అక్కడ వుండి తనకు వైద్యం చేస్తున్న సోదరి డాక్టర్ ఇనజకుమారిని చూపిస్తూ "వీళ్ళు డాక్టర్లు – ఏదో చేస్తున్నారు. నన్ను కాపాడగలరా ఎవరైనా ? నేను ఉండాలనుకుంటే ఉంటాను. వెళ్ళాలనుకుంటే వెళ్ళిపోతాను" అన్నది. ఇటు శివానందమూర్తిగారితో "నాన్నా! నేను కొంతకాలం ఉండాలని నువ్వు అంటున్నావు. ఉంటే అపసవ్యాలేవైనా జరిగితే – అది ఫర్వాలేదా?" అని అడిగింది. శివానందమూర్తిగారు వెంటనే ఒక ఇంటి పెద్దబిడ్డగా అమ్మతో "అమ్మా! నీకు సవ్యం లేదు. అపసవ్యం లేదు. ఎవరి ముందు వెనుకలు ఎక్కడ జరిగినా నీ దగ్గరకే వస్తారు. ఇంకొక చోటికి పోరు. కాబట్టి ఉండండి" అన్నారు.

అమ్మ ఆలయప్రవేశం చేసిన తర్వాత శ్రీశివానందమూర్తిగారు జిల్లెళ్ళమూడి వచ్చారు. కళాశాల హాస్టల్ పునాదులు వేయటానికి, ప్రారంభోత్సవానికి కూడా – రెండుసార్లు వచ్చారు. భౌతికంగా అమ్మను రెండుసార్లు చూశారు. అర్కపురిలోని తేజోమయమూర్తిని రెండుసార్లు దర్శించారు. అమ్మకు అన్నాభిషేకాన్ని ఆరంభించారు. అంతకుముందు అమ్మకు నిత్యజలాభిషేకము (రుద్రాభిషేకము), సంవత్సరానికొకసారి ధాన్యాభిషేకము చేస్తున్నాం. వారు అన్నాభిషేకం చేయండి మీరు వెనుదిరిగి చూడాల్సిన పని ఉండదు. అమ్మ అనుగ్రహవర్షం అన్ని రంగాలలోనూ ఉంటుంది అన్నారు. అలా అమలు చేయటం జరిగింది అన్నాభిషేకం.

ఈ రచనలు 'విశ్వజనని' పత్రికలో ప్రచురించటం జరిగింది. ఒక సోదరి దీన్ని గ్రంథంగా తెస్తే బాగుంటుంది అన్నది. నిజమే అనిపించింది. ఈ రోజు ఈ ఆకారం ధరించింది. సద్గురువులు, జ్ఞానస్వరూపులైన శ్రీ శివానందమూర్తి వాక్కులలో అమ్మ పరాశక్తి అవతారం. కాళీ స్వరూపం. ఈ విషయాలను వివరంగా పలికారు. మళ్ళీ మళ్ళీ చదివి వారు సూచించిన మార్గంలో పయనిస్తే మనం కూడా తరించవచ్చునే ఆశతో ఈ ప్రచురణ. దీనికి సహకరించిన శ్రీ ఎ.వి.ఆర్. సుబ్రహ్మణ్యంగారికీ, శ్రీ పి.యస్.ఆర్.ఆంజనేయప్రసాద్‌గారికి అభినందనలు. అమ్మ ఆశీస్సులు.

– శ్రీవిశ్వజననీ పరిషత్

కాలస్వరూపిణి అమ్మ

(12.6.05న అమ్మ అనంతోత్సవాలలో చేసిన ప్రసంగ భాగం)

ఈ క్షేత్రానికి నేడు నేను వచ్చి దర్శనము చేసికొనే సంకల్పము నిన్న మొన్నటిది కాదు. సుమారు 30 సం॥కు పూర్వం ఇక్కడకు నా ధర్మపత్ని గంగాదేవితో కలసి వద్దామనుకొని అంతా సిద్ధం చేసుకొన్నాము. ఆ రోజు నాకు ఉద్యోగంలో ఏదో ఎమర్జెన్సీ చాలా అర్జంటు పనులు రావడం చేత నేను రావడం కుదరలేదు. అయితే నా ధర్మపత్ని గంగాదేవిని మాత్రం యిక్కడకు పంపించి నీవు వెళ్ళి ప్రసాదం తీసుకొనిరా అని చెప్పాను. ఆమె యిక్కడకు వచ్చింది. ఇక్కడ ఒక రోజు ఉన్నది. ఆ తరువాత నా ప్లాను యిప్పటికి సాగింది. 30 ఏళ్ళు ఆలస్యం అంతే. ఏదో జరుగుతాయి. మనం ఏమనుకుంటామో అలాగ జరగడం కంటే దైవేచ్ఛ ఎలా వుంద్దో ఆలా జరగటమే మనకు క్షేమము. అందుకని ఈ రోజు రావడమే బహుశా అమ్మ సంకల్పము. అమ్మ సంకల్పమూ దైవ సంకల్పమూ రెండు ఒకటే. ఆ భావంతోనే నేను సంతృప్తిగా ఉన్నాను. ఎప్పుడు జరగడానికి వీలుంటుందో అదే సంకల్పము. జరిగిందే ముహూర్తం' అని అమ్మ చెప్తూ ఉండేది కదా! పెట్టుకున్నది ముహూర్తం కాదు. పెట్టుకుంటాం. శాస్త్రీయంగా చాలా ముహూర్తాలు పెట్టుకుంటాము. చివరకు ఆ ముహూర్తంలో 'తదేవ లగ్నం సుదినం తదేవ తారాబలం చంద్రబలం తదేవ లక్ష్మీపతేః అంఘ్రి యుగం స్మరామి'. లక్ష్మీనారాయణులను స్మరించటం అదే ముహూర్తము గాని నేను పెట్టుకున్నది కాదు అని అర్థము. అలా అయింది.

ఈనాడు అమ్మ దేహవిసర్జన చేసిన పుణ్యతిథి. ఈనాడు ఈ క్షేత్రాన్ని చూడ్డం నాకు మరింత శ్రద్ధ, ఆసక్తి, విశేషమైన శాంతి కల్గినాయి. అమ్మ దశమి నాడు సిద్ధి పొందింది. అమ్మ వెళ్ళిపోయిన 12-13 గంటల తరువాత నా ధర్మపత్ని గంగాదేవి కూడా వెళ్ళిపోయింది. రేపు తెల్లవారితే ఆమె తిథి. అందుకని అక్కడకు వెళుతున్నాను. నాకేమీ వెళ్ళవలసిన పనిలేదు. పిల్లలు చేస్తారు. వెళుతున్నాను. ఇక్కడకు వచ్చాను. అక్కడకు వెళుతున్నాను. సరే అది చిన్న విషయం.

భారతీయ సంస్కృతి యొక్క నిజస్వరూపం ఏమిటి ? దీన్ని అర్థం చేసుకున్నాము అని ఎవరైనా అనుకుంటే అది పరీక్ష చేస్తుంది. అర్థం కాలేదు, తెలియదు అంటే పరీక్ష ఉండదు. అది అందరికీ క్షేమము. చాలా మార్గాలు ఉన్నాయి. అన్ని మార్గములు కూడా తరతమ భేదము లేకుండా వాటి వాటి ఫలాలు యిస్తున్నాయి. "ప్రథమే ప్రస్థానే ఋజు కుటిల నానా పథ తుషారాం నృణాం ఏకో గమ్యోహమ్ త్వమసి" దగ్గర దారి, దూరపు దారి, అడ్డదారి, వంకర దారి ఎన్నో వుంటాయి. గమ్యస్థానానికి ఎవరు ఏ మార్గంలో వెళుతారో అది వారికి నిర్దేశించబడి వుంటుంది. వారా మార్గంలో ఉత్తీర్ణులవుతారు. నా మార్గం గొప్పదని ఎవరూ కూడా అనుకోవడమే సరికాదు. గమ్యస్థానం చేర్చగలిగిన మార్గమే మార్గము. ఎవరు ఏ మార్గంలో వెళతారో అది వారికి ఉత్తమము. అమ్మ విషయంలో బాగా ఆలోచించినట్లయితే ఈ అమ్మ వచ్చి ఏ మార్గం మనకు చెప్పింది ? ఇది వరకు వున్న మార్గములలో మళ్ళీ ఆ విధానమే చెప్పేటట్లయితే అందులో విశేషమేమున్నది ? పునరుక్తి దోషాలుంటవి కదా ! దైవాంశులకు యింతకు పూర్వం ఎవరో చెప్పిన మార్గమే మరొకమాటు చెప్పే అవసరం వారికి ఉండదు.

అపూర్వమైనటువంటిది, ఇతః పూర్వం ఎవరూ చెప్పనటువంటిది, ఈ కాలానికి, ఈ యుగానికి, ఈ ప్రజలకు, నేటి సమాజానికి ఏది యోగ్యమైనటువంటిదో అది చెప్పడమే వారి సంకల్పము. అంటే ఒక అపూర్వమైనటువంటి, విశిష్టమైనటువంటి, ఒకానొక కారణంతో ఈశుడు భూమికి వస్తాడు. అనేకమార్గములు మహాభారత కాలానికే వున్నాయి. వాటినన్నింటిని సమన్వయం చేసి ఒకానొక బోధలో భగవంతుడే గీతలో చెప్పాడు. అయితే ఆ గీతలో చెప్పినటు వంటి అన్ని మార్గములు కూడా భగవంతుడి వాక్యం కాబట్టి ప్రమాణం. ఒక వేళ ఆయన భగవంతుడు కాదని మనం అనుకుంటే వేద సంహితంగా చెప్పాడు కాబట్టి ప్రమాణం. భగవంతుడు చెప్పిన మాటకు వేరే ఒక ప్రమాణం మనం అన్వేషించాల్సిన పని లేదు. ఆతడు భగవంతుడు కాదని అంటే దీనికి ప్రమాణం ఏమిటంటే వేదములలో ఉపనిషత్తులలో ఏ మార్గం నిర్దేశించబడిందో వానికి అనుగుణమైన వ్యాఖ్య మాత్రమే గీతలో చెప్పబడి వున్నది. అమ్మ అన్ని మార్గములు సమన్వయం చేస్తారు.

మనందరము కూడా అనేకమైన దేవతలను ఆరాధిస్తు న్నాము. మీరందరూ వినే వుంటారు. 'త్రిపుర' అని అంటారు. దానికి ఒక అర్థం – త్రిః పుర ముగ్గురు మూర్తులకూ పూర్వము నుండీ ఉన్న పరాశక్తి అని అర్థం చెపుతున్నారు. అంటే త్రిమూర్తులు, జగత్కారణ కారణము, సృష్టి స్థితి లయములు, జీవకోటి యొక్క ఆవశ్యకత ననుసరించి చేయడమనే ఈశ్వర సంకల్పము ఏదైతే వున్నదో దీని అంతటికి కూడా ఒక ప్రణాళిక ఉన్నది. అసలు ఎందుకు ఈశ్వరుడు ఈ సృష్టిచేశాడు? కొందరు అంటారు – అది అంతా లీల, అనుకోవడం కోసం చేసాడు. ఇంత సృష్టి చేసి ఇందులో వినోదం చూసి ఆనందించే అవసరం ఆవశ్యకత ఉందా ఈశ్వరుడికి ? అని ప్రశ్న. అలాంటి ఆవశ్యకత ఆయనకు లేదు. ఎందువల్లనంటే ఆయన ఆనంద స్వరూపుడు. జ్ఞానస్వరూపుడు, సచ్చిదానంద స్వరూపుడు. సృష్టి చేసి, సృష్టిలో జీవకోటిని చూసి ఆనందించవలసిన పనిలేదు. మరి ఎవరికోసం చేసాడంటే ? తన కొరకే సృష్టి చేసిన వాడు కాదు ఆయన.

చిరకాలం నుండి అంధకారంలో వుండే జీవకోటి ప్రకృతిలో ప్రవేశించి, పరిణామ దశలను దాటి, తన వద్దకు రావడానికి ఒక మార్గం కోసమని ఈ జగత్తుని సృష్టించాడని చెప్పుకోవాలి. లేకపోతే అంధకారంలో నిద్రావస్థలో అనంతకోటి జీవరాశులు వుండిపోయినాయి. వారందరూ పరిణామ దశలలో ప్రకృతిని అనుభవించి, కర్మలో ప్రవేశించి, ఏతత్కర్మ ఫలాలు అనుభవించి, సుఖమేదో – దుఃఖమేదో తెలుసుకొని, కర్తవ్యమేద తెలుసుకొని, తరువాత శుభేచ్ఛచేత తన వద్దకు జీవకోటి రావాలి. అలాంటి వివేకం జీవులకు కావాలంటే జన్మలెత్తాలి. జన్మ సుఖమా ! దుఃఖమా ! ఇవన్నీ తెలుసుకోవాలి. ఎన్నో లోకాలు వున్నాయి పైనా, క్రిందా. వీటి యొక్క అనుభవం అంతా కావాలి. ఆ తరువాత శుభేచ్ఛ. అంటే ముక్తి యందు ఇచ్ఛ కలుగుతుంది. ఆ తరువాతే యధార్థమైన ప్రయాణం జీవునకు మొదలవుతుంది.

కలిలో, మొత్తం నాల్గు యుగములు కలిసి 43 లక్షల 20 వేలు సంవత్సరములని చెప్పుతున్నారు. అందులో అదృష్ట వశాత్తూ నాల్గు యుగములు కలసి ఒక మహాయుగ అంటారే ఆ మహాయుగములో కలి దశాంశం అంటే పదవ వంతు మాత్రమే.

చాలా అల్పమన్నమాట. యుగమూ అల్పమే. మనకు ఆయుర్దాయమూ అల్పమే, మన శక్తి సామర్థ్యాలూ అల్పమే, జ్ఞానమూ అల్పమే, తపశ్శక్తీ అల్పమే, అల్పజీవులమే. కాబట్టి భగవంతుడు ఏ అనుగ్రహము చేత సృష్టి చేసాడో ఆ అనుగ్రహము మన యందు ప్రసరించి మనకు ముక్తి లభించాలంటే కాలానుగుణమైన వీరి అశక్తతకు సరిపడ్డ ఒక మార్గాన్ని సూచించడం ఈశ్వర సంకల్పము. ఎంత అశక్తుడైతే అతనికి అంత సులభ మార్గం యివ్వబడుతుంది. ఒకనాడు రామాయణ కాలం నుండి మహాభారతకాలము వరకూ కూడా వేలాది సంవత్సరములు తపస్సు చేసిన మహాయోగులున్నారు. మహర్షులున్నారు. వారికి అంత సామర్థ్యమున్నది. ఈనాడు 10 ఘడియలు నిరాహారంగా తపస్సు చేయగల సామర్థ్యం లేదు జీవకోటికి. ఏమిటి మార్గం? మోక్షేచ్ఛ లేదా ? చాలా మందికి ఉన్నది. శక్తి లేదు. ఎందులోనూ ప్రవేశించలేడు. యోగం, ప్రచారణ వర్గాలు చేస్తారా ? వేదవేదాంగములు చదివి అనేకములు చేయగలరా? స్వర్గమునకు వెళతారా? ఏమి లేదు. దానికి పరిజ్ఞానం కూడా క్షీణించిన దశలో మనుషుల నుద్ధరించడానికి ఒకానొక విశిష్టమైన సంకల్పం ఈశ్వరుడు చేసాడని మనం నమ్మాలి.

జగత్తులో 'అమ్మ' అనే మాటకు విశిష్టత ఉన్నది. పశువులు, పక్షులు,మనుషులు అందరికీ కూడా తల్లి వుంది. దేవతలకేమో అదితి, రాక్షసులకేమో దితి, వాళ్ళకి కూడా తల్లి వుంది. తల్లి యొక్క స్వభావము మన అనుభవములో ఎలా వుందంటే ఒక మనిషిని సంతానంగా కని వదిలివేస్తుంది. కన్న బిడ్డ తన యొక్క వివేకముతో తన ప్రయత్నము చేత ఏ జ్ఞాన సంపద సంపాదించుకుంటాడో అది అతడికి యోగ్యమైనటు వంటిది. అతడి పురాకృత జన్మలో ఏది విధించబడిందో ఆ త్రోవన వాళ్ళు వెళ్ళిపోతారు. బిడ్డల యొక్క భవిష్యత్తులో గాని వాళ్ళ ముక్తి మార్గంలో గాని, వాళ్ళ పూర్వపుణ్య ఫలాలలో గాని తల్లికేమీ భాగస్వామ్యము లేదు. అంటే కని వదలడమే ప్రకృతిలో మాతృ లక్షణము.

ఈ అమ్మ ఎవరు ? మనందరికీ లలితా సహస్ర నామము వచ్చు. 'ఉన్మేష నిమిషోత్పన్న విపన్న భువనావళిః' అనేది ఒక మాట. ఈ పరాశక్తి, ఈ అమ్మ

కనులు రెండూ తెరచినపుడు జగత్తూ అంతా వుంది అక్కడ. కళ్ళు మూసుకుంది, జగత్తంతా లయం అయిపోయింది. ఉన్మేషంలో జగత్తు నిమేషంలో జగత్తు అని కళ్ళు తెరిచింది జగత్తుంది అంతే. అందరు దేవతలున్నారు, త్రిమూర్తులున్నారు. ఈ సృష్టిని చేసిన "బ్రహ్మ యధాపూర్వ మకల్పయత్" పూర్వం ఎప్పుడు ఒక కల్పంలో ఈ జగత్తు ఎలా ఉండిపోయిందో లయం తర్వాత మళ్ళీ పునఃసృజన. ఆ పూర్వం వలెనే మళ్ళీ సృష్టిస్తున్నాడు ఈశ్వరుడు. ఈ భావంలో ఈ కథ మళ్ళీ జగత్తుతో మొదలైనది. అంత సులభమై సందర్భ మాత్రం చేత, ఒక క్రియ అంటూ ఏమీ లేకుండా జరుగుతున్నది. దానికి ఒక ప్రణాళిక అంటూ ఏమీ అవసరం లేదు. జగత్తు ఉండును గాక అని ఉన్నటువంటి అనేక లోకములు, అనేక జీవకోటి రాశుల యొక్క వారి వారి పరిణామ దశలు, వారి వారి సంస్కారములు, వాళ్ళ జన్మపరంపర. మరొకసారి కథ మొదలై ఆ జీవికోటి అంతా మళ్ళీ పరిణామం చెంది ఈశ్వరుని చేరుకోవడానికి మరొక కల్పము మరికొందరికి ఇవ్వబడినది. తపస్సులు గాని, యోగంగాని, త్యాగం గాని, సంపూర్ణ వైరాగ్యం గాని ఎటువంటి సామర్థ్యం లేని జీవులకు కూడా మోక్షేచ్ఛ ఉండటం ఇందులో విశేషం. నాకు ముక్తి కావాలని చాలా మంది అడుగుతూ ఉంటారు. ఏ సమర్ధతా లేదంటారు. పోనీ "40 రోజులు ఉపవాసము ఉండు' అంటే 40 ఘడియలు ఉండలేరు. ఏమిటి దీనికి కారణము ? పశువులు గాని, పక్షులు గాని, మనషులు గాని, దేవతలు గాని కని వదిలేయడమే గాని వెనుకకు తీసుకుంటున్నారా ? లేదు అందుకని త్రిమూర్తులకుకూడా పూర్వముఉన్నటువంటి ఏ చిచ్ఛక్తి, కాలస్వరూపం ఏదైతే ఉన్నదో అది అమ్మ. అశక్తులైన వారు ఎవరో వారు లయం కావటం కొరకై ఒక విశిష్టమైన అవతారం అమ్మది. అంటే ఈ అమ్మ జగన్మాత.

ఇక్కడ అద్వైత సిద్ధాంతములో ప్రతిపాదన మార్గము లేదు, బంధనము లేదు. "మోక్ష సిద్ధమేవ" నీవు ముక్తుడై ఉన్నావు. బంధనమే లేదు. అంతా మిథ్య" ఇటువంటి మాటలు చెబుతున్నారు. ఇవన్నీ అర్థం చేసుకుంటే మోక్షం వస్తుందని అంటున్నారు. అది కూడా బుద్ధి కుశలతతో, శాస్త్రాధ్యయనంతో ముడిపడి ఉన్నది. దానికి ఉపాసన అంటూ ఏమీ లేదు అని అంటున్నారు. బాధలేదు. అక్కడ ఈ

గ్రంధం ఈ పఠనం, ఈ మననం చేసుకోవడం తప్ప ఆలంబన లేదు. దేన్ని పట్టుకొని పైకి వెళ్ళాలి నేను ? అది లేదు. ఈ మాతృస్వరూపిణి నేనున్నానని చెబుతున్నది. ఇక ఆలంబనము కావాలి కదా ? ముక్తిలో నాలో కలవాలంటే నీకూ నాకూ మధ్య దూరమే లేదు. నేనిక్కడకు వచ్చాను. నిన్ను నా లోపలికి తీసుకుంటాను. అహర్నిశమూ, హరిస్తాను, లయం చేసుకుంటాను మధ్య మార్గమంటూ లేదు అంటున్నది. అందుకే అమ్మ "పూర్వజన్మ, ఉత్తరజన్మ అంటున్నారు. ఇవన్నీ ఎప్పటికయ్యేను? ఇవన్నీ లేవురా! ఇవన్నీ ఎందుకు ?" కోరుకో అంటూ సులభమైన మాటలతో పల్కేది అమ్మ. నేనున్నాను. కోరుకుంటే నీవు వచ్చి నాలో పడిపోతావు మళ్ళీ మళ్ళీ వెళ్ళవు. ఇతర తల్లులు కని వదిలి వెళ్తున్నారు. నేను వదిలి వెళ్ళిన పిల్లలను, మళ్ళీ వెనక్కు తీసుకోటానికి వచ్చాను అని అర్థము. ఆ అర్థములో అమ్మ కాళీస్వరూపిణి. కాళి అంటే కాలస్వరూపిణి. ఉజ్జయినీ మహా పట్టణములో కాళేశ్వరుడున్నాడు. మహాకాళీ ఉన్నది. అలాగే కాశీ ఉంది. అక్కడకు ఎందుకు వెళ్తారు ? వారిని ఆశ్రయిస్తే సాధన, తపస్సు ఉన్నా లేకున్నా చివర ఘడియలలో తనలోకి తీసుకుంటారు. అమ్మ తీసుకుంటుంది. ఈశ్వరుడు తీసుకుంటాడు. అంటే శరీరము వదిలి పెట్టటానికి కూడా ఒక క్షేత్రము సంప్రదాయములో ఏర్పాటు అయినది.

కళ్యాణము కొరకు, ధనము కొరకు, సంతానము కొరకు, లాభము కొరకు అభీష్టసిద్ధి కొరకు అనేక క్షేత్రములు వెళ్తాము. అవి అన్నీ అటువంటి స్థానాలు. వెనక్కి తిరిగి రాకుండా వెళ్ళగలగాలి ఈ లోకమును వదలి. అలాంటి క్షేత్రము కూడా కాశీలో మన వాళ్ళు ఏర్పాటు చేశారు. అక్కడ ఈశ్వరిని, జగన్మాతను, మహాకాళేశ్వరిని, కాలస్వరూపిణిగా చూస్తాము. కాలంలోనే పుట్టి కాలంలోనే లయిస్తుంది. ఆ కాలం యొక్క పరిమాణము చూస్తే అనేకమంది బ్రహ్మదేవుళ్ళకు జీవితం. బ్రహ్మకు నూరేళ్ళు దివ్య సంవత్సరాలంటే, అలాంటి బ్రహ్మ యొక్క కాలం అనంతమైన కాలం. అనంతమైన కాలమే కానీ అందులో ప్రవేశించి ప్రయాణిస్తే ఎన్ని జన్మలైనా అందులోనే బంధనలో ఉండవచ్చు, ఈశ్వరానుగ్రహము లేనప్పుడు, దాన్ని అడగాలనే జ్ఞానము కూడా లేనప్పుడు చంటిపిల్లవాడు ఏమి తెలియక ఇక్కడే

ఆడుతూ ఉన్నట్లు అలాగే జీవుడు కూడా అనేక జన్మలెత్తుతూ ఇక్కడే ఉంటున్నాడు. ప్రతి జీవునికి కూడా ఏదో ఒకనాడు తీవ్రమైన ఇచ్ఛ కలిగినపుడు, నా వల్ల ఏమీ కాదు, నేను అశక్తుడను, ఈశ్వరుడే నా ఇచ్ఛ. అటువంటి తీవ్రేచ్ఛ కల్గిన వారిని తాను తీసుకొని వెళ్లటానికి వచ్చిన 'కాళి' కాలస్వరూపిణి అమ్మ అని నా విశ్వాసము. అమ్మ దగ్గర మనస్సు, బుద్ధి, అహంకారము అన్నీ ఉన్నాయి. మరి మనము అమ్మని ఎలా చేరుతాము ?

అదిగో ఆ సంకల్పము, ఆ సంకీర్తన, అమ్మతో ఉండిపోవడం. కాశీ వెళితే మళ్ళీ వెనక్కి రాకుండా ఎలా వుండి పోతామో, అలాగే అమ్మ దగ్గరకు వచ్చాక మళ్ళీ వేరే ప్రయాణం, ఇంకొక క్రొత్తసాధన, వేరే మంత్రోపదేశము ఇలాంటివన్నీ కూడా కొంత కాలం క్రియారూపంలో వుండేవి. ఏదీ లేకుండా అమ్మని శరణాగతి పొందిన వారిని అమ్మ ఒడిలో నిదురించిన శిశువు లాగ తన వద్దకు తీసుకోవడానికే కారణ జన్మ ఎత్తింది. అమ్మ ఎవర్నైతే, కలవదలచుకున్నారో, ఎవరెక్కడెక్కడ వున్నారో మనకు తెలియదు. కాని ఆమె వారందర్నీ తన దగ్గరకు తీసుకోవడానికి వచ్చింది.

అమ్మ అన్నం పేట్టేది. అమ్మ అన్నం పెట్టడం సహజమే కదా ! ఇంట్లో మనమంతా అమ్మ చేతిలో అన్నం తిన్నం వాళ్ళమే. పుట్టిన వాళ్ళు అమ్మ చేతి అన్నం తినని మనుషులుండరు. ఎత్తుకొని తినిపిస్తూ పేచీ పెడితే కూడా ఎత్తుకొని ఆడించి తినిపిస్తుంది. ఈ అమ్మ పెట్టే అన్నానికి కడుపు నిండడం ప్రధానమా ? లోకంలో ఇళ్ళల్లో అమ్మలు పిల్లలకు పెట్టే అన్నం వాళ్ళు బలంగా ఉండాలి, ఆరోగ్యంగా ఉండాలి, బాగుండాలి అని. ఈ అమ్మ పెట్టే అన్నం మనందరం అంటూ ఉంటాం నూకలు ఎన్ని ఉన్నాయో అంతకాలం ఉండాల్సిందే అని. చివరి నూకలు అమ్మ యిచ్చింది. ఇక నీకు ఆ అవసరం లేదురా అని. ఆమె కార్యంలోనే ప్రతిదీ ఒకభాగంగా మీరు గుర్తించినట్లయితే ఆమె కాలస్వరూపిణి అనీ, ఆమె చేసిన ప్రతి పని, ప్రతిమాట, నీకు – నాకు మధ్య దూరం లేదు నే వచ్చాను ఇదిగో యీ గుప్పెడన్నం పెడుతున్నాను. ఈ ముద్దను తింటావా ! ఇందులో వెయ్యి మెతుకులున్నాయి. ఒక్కొక్క మెతుకు ఒకొక్కక జన్మకు సరిపోతుంది. ఆ జన్మలిక నీకుండవు అని అమ్మ పెట్టిన అన్నానికి వ్యాఖ్యానం.

అమ్మ ప్రతి విషయంలోను కూడా తను ఎందుకొచ్చిందో, ఎవరిని తీసుకొని వెళ్ళడానికి ఎలా తనలో కలుపుకోవడానికి, వచ్చిందో ఎలా తీసుకొని వెళ్ళిందో! ఆ విషయం చెప్పేటట్లయితే అమ్మో ! చిత్రమైన మనుషులం మనం ముక్తిని అడుగుతాం కానీ 'రేప్పొద్దున ఏడుగంటలకు వస్తాను, నిన్ను తీసుకొని వెళ్ళిపోతాను' అని ఇంద్రుడో, బ్రహ్మో అంటే ఎంత భయపడతామో! ఏదో ముక్తిని అడిగాను కాని రేప్పొద్దునే ఎక్కడ వెళ్ళిపోతాను ?కాబట్టి మనిషికి అంతఃకరణలో ఒక కోరిక వుంటుంది. కాని తక్షణమే సద్యోఫలంగా ఎవరైనా అది ఇస్తానంటే కూడా ఈ ప్రపంచాన్ని వదలడం సులభం కాదు మనకు. అది ప్రకృతి యొక్క బలమైన బంధం. జీవుని బంధించింది. పశువుని తాడుతో చెట్టుక్కట్టినట్లు దేహమనే పంచ భూతాత్మకమైన బొమ్మను ఆడిస్తూ ప్రాణాన్ని పెట్టుకొని లోపల జీవుడ్ని పెడుతూ ఆ జీవుడికి శరీరం మీద మక్కువ తోసుకు వచ్చింది. వక్కువ లేకపోతే, దేహాత్మ భావము, దేహాభిమానము లేకపోతే జీవకోటికి స్పీసీస్ అంటాం అవి నడవవు. జీవుల అవసరం. ఎందుకు అవసరం ?

అనేక జన్మలు ఎత్తాలి. కోటాను కోట్లు జీవులున్నారు. వాళ్ళందరికీ జన్మలు కావాలి. పరిణామ దశలు కావాలి. ప్రకృతి అనుభవం వారికి తెలియాలి. సుఖం అంటే దుఃఖం అంటే తెలియలి. అందులో శుభేచ్ఛ ఎప్పుడో మోక్షేచ్ఛ కలుగుతుంది. కాబట్టి అనేక జన్మలు అందరికీ అవసరం. ఎన్ని జన్మలు ఎత్తినా శుభేచ్ఛ కలిగే దాకా ఆతనికి యిక్కడ ఉండక తప్పదు. శుభేచ్ఛ వచ్చిన తరువాత ఇందాక మనమనుకున్నట్లు శక్తి సామర్థ్యాలు లేవు. కోరిక కల్గింది కాని దానికి సులభోపాయం చెప్పండి అంటారు. పరీక్షిత్తుకి ఏడురోజుల నోటీసు వచ్చింది. అందరూ తలోపని చేయడం మొదలెట్టారు. ముందర శాంతులూ హోమాలూ అవన్నీ. ఎక్కడో దూరంగా ఒంటి స్థంభం మేడకట్టి అందులోకి పాము పిల్ల కూడా రాకుండా గట్టి బందోబస్తు చేసారు. పరీక్షిత్తుకి వాటి మీద శ్రద్ధ లేదు. నన్ను వీళ్ళందరూ రక్షిస్తారని ఆయన అనుకోవటం లేదు. ఏడు రోజుల కాలం కనుక ఆయుర్దాయం ఉంది అని తెలిస్తే నేనేమి చేయాలి అని ప్రశ్న. ఆయనకి ఏడు రోజులైనా ముందరే ఒక నోటీసు అంటూ వచ్చింది. ఒక్కొక్కరికి ఏడు ఘడియల నోటీసు కూడా ఉండదు. పోయేదాకా తెలియదు. ఏమి చేస్తాడు మనిషి ? అన్నారు – ఏవో ఆయుష హోమాలు అవి

చేస్తాము. తపస్సు చేస్తాము అన్నారు కాని ముక్తికి ఉపాయం ఏమిటి ? అని అడిగితే భగవన్నామం, భగవచ్చరిత్రలు వినమని జ్ఞానులుపదేశించారు. అది విన్నాడు పరీక్షిత్తు. అదే భాగవతం చెపుతుంది. అదే తప్ప ఇపుడు నీవు యోగంలో కూర్చో. నీకు నేను కుండలినీ జాగరణం చేస్తాను. నీకు సమాధిని నేను యిస్తాను అని మాత్రం అనగలిగిన వారు లేరా ఆ కాలంలో. అంటే తను సాధన చేసుకోవలసి వస్తుంది. సాధన చేసుకుంటే ఏడు రోజులు సరిపోదు. సాధన లేకుండా ఏడు రోజులలో ఏ పని చేస్తే వస్తుంది మళ్ళీ వెనక్కి రాకుండా ! భగవన్నామమే చెప్పారు. మనషులందరికీ కూడా ఎపుడు ఎవరికి ఎక్కడ పిలుపు వస్తుందో తెలియదు. మనకి చిత్రం ఏమిటంటే సృష్టిలో మృత్యువు అనేది లేకపోయినా మృత్యుభయం మాత్రం వుంది. నిజంగా మృత్యువు లేదని ఉపనిషత్తులు చెపుతున్నాయి. కాని మృత్యు భయం తప్పిందా? ఎంత బోధలు వింటే కూడా తప్పలేదు.

ఈ మృత్యు భయం ఉండే మర్త్యులు వీళ్ళకి సాధనా మార్గాలు అంటే ఏమిటి ఎలా ఉంటాయి అనేవి ఉండనే వుండదు. వీళ్ళని అనుగ్రహించి తన లోకి తీసుకోవలసిందే. అలాగ అనేక మంది జీవులు ఈ లోకం లో ఎదురుచూస్తూ నిస్సహాయస్థితిలో ఉన్నప్పుడు తాను వచ్చి ఒడిలోకి తీసుకుంటుంది. ఆమె ఒడిలోకి తీసుకోగలిగిన తల్లి ఈ తల్లే. అందుకనే 'ఉన్మేషనిమిషోత్పన్న విపన్న భువనావళి' అని వుంది. కని వదిలి పెడుతున్నారు కర్మఫలం అనుభవించ మని. వెనక్కు తీసుకోగలిగిన తల్లి లేదు సృష్టిలో. ఇంకెవరు? ఈ తల్లి వుంది ఆ అంశ ఆ అన్నపూర్ణ అనసూయ.

కాని మాతృవాత్సల్యం కోరతారు మనుషులు. నిన్ను తీసుకు వెళ్ళటానికి వచ్చాను అంటే భయపడతారు. ఆ మాట వాళ్ళకి చెప్పకూడదు. మామూలు మాతృవాత్సల్యంతో ఏదో అన్నం ముద్దలు పెడుతున్నదే అలా పెట్టినట్లే పెట్టాలి. పెట్టి వారికి ఏమి పెడుతుందో ఎందుకు పెడుతుందో అమ్మకి తెలుసు. వీళ్ళు – అమ్మ నాకు ప్రసాదం పెట్టింది. ఆ మర్నాటి నుండే నాకు ఆరోగ్యం బాగు పడింది. నా పిల్లలు పరీక్షలు పాసయ్యారు. అమ్మ అన్నం తిన్నాక అని అనుకుంటారు. అయితే కావచ్చు. కాని

అమ్మ దానికోసం అన్నం పెడుతుందా! ఆమె పెట్టే ఒక మెతుకూ ఒక జన్మకు సరిపడా తృప్తమయపోయింది. అనేక జన్మలపరంపర హ్రస్వమయి పోయింది. జన్మ పరంపర అంతా జీరో అయిపోయింది. ఆ దృష్టితో అమ్మ మాతృవాత్సల్యంతో చిన్న చిన్న మాటలు మాట్లాడుతూ పరమ సత్యాలను, ఉపనిష ద్వాక్యాలను, ధర్మసూత్రాలను చెప్పింది. ఆమె తెలుగు మాట్లాడినా వింటున్నపుడు బ్రహ్మసూత్రాలే జ్ఞాపకం వస్తాయి. "అల్పాక్షరం అసందిగ్ధం సారవత్ విశ్వరూపకం" సూత్రమెలా ఉంటుందంటే కొద్ది అక్షరాలే ఉంటాయి సందిగ్ధం లేకుండా ఉంటుంది. విశ్వ వ్యాప్తంగా ఎక్కడ అప్లయి చేసినా అందులో సత్యం కనబడుతుంది. అమ్మ చెప్పిన మాట కూడా ఉపనిషద్వాక్యముగా, సూత్రప్రాయముగా చెప్పినది. అమ్మ భాష - తల్లి పిల్లను ఒడిలో పెట్టుకొని కఠినమైన సంస్కృత వాక్యాలు చెబుతుందా ? పిల్లలకు అర్ధమయ్యే బుజ్జి బుజ్జి మాటలతో మాట్లాడుతుంది.

ఆ భాషలోనే మాతృత్వం ఉంది. మన అల్పత్వం ఆమెకు తెలుసు. ఈ చిన్న మాటలు చెబితేనే వారికి అర్ధమవుతుంది. గోరు ముద్దలు చిన్న చిన్నవి పెడితేనే చంటి పిల్లలు తింటారు. అందుకని వాత్సల్యంతో, చిన్న చిన్న మాటలు, బుజ్జగింపుమాటలు, మన సందేహాలను పారద్రోలేటటువంటి మాటలు, లోపల మననం చేసుకుంటే తరింప చేసే మాటలు చెబుతూ వచ్చింది. మహాత్ములు మాట్లాడారు, ఋషులు మాట్లాడారు, సామాన్యులు మాట్లాడారు. తేడా ఏమిటంటే దైవాంశ, మనకు ఒక మాట చెప్పిందంటే అది అర్థమైనా కాకపోయినా బుద్ధిలో ప్రవేశించి జీవుడి దగ్గరకు వెళ్తుంది ఆ మాట.

లోపల ఉన్న జీవాత్మకు బోధ అవుతుంది. లేవరా నేనొచ్చాను నా లోపలికి రా అని చెప్పదన్నమాట. జీవుడిని అడ్రసు చేస్తుందావిడ. మనుషులకు బుద్ధితో మాట్లాడినట్లు కన్పడినా ఆమె ప్రతివాక్యం కూడా తన వద్దకు వచ్చే జీవకోటికి ఈ లోపల ఉండే అంతఃకరణ జీవుడున్నాడే వాడికి అన్వయించే వాక్యములు వాడి దాకా వెళ్తాయి. మీరు బాగా చూసినట్లయితే ఒక్కొక్క వాక్యము విశ్లేషణ చేసినట్లయితే ఇది బుద్ధి కోసం చెప్పినదా, నా మనస్సుకు అర్థం కావడానికి చెప్పిందా, నాలోని

జీవుడికి చెప్పిందా అని తెలుస్తుంది. చాలా వాక్యాలున్నాయి. అమ్మ వాక్యాలు జగన్మాత వాక్యాలు. జీవుడిని ఉద్దేశించి చెప్పిన మాటలే కాని మామూలుగా బోధించే మాటలు కావు. బోధించడం వేరు. బోధిస్తే బోధపడాలి. మననం చేయాలి. ద్రష్టవ్యంలో మంత్రంతో, శ్రోతంతో, నిధి, ధ్యాస ఇలా బాగా ధ్యానం చేయాలి. ప్రతి వాక్యాన్ని విశ్లేషణ చేయాలి. ఇది సత్యమా అసత్యమాయని పరీక్ష చేయాలి. దీన్ని పరీక్ష చేయాలి. దీని ప్రమాణం ఏమిటని పరీక్ష చేయాలి. ఇది ఎప్పటికి అవుతుంది? అంత సమయం ఎక్కడుంది? అంతజ్ఞానం, అంత ఓపిక ఎవరికున్నది? చాలా మందికి మోక్షం కావాలని ఉంటుంది. ఇంకా రెండు పనులున్నాయి. ఐదు సంవత్సరముల సర్వీసు ఉన్నది. రిటైర్ అయిన తరువాత చెబుతాం తప్పని సరిగా అంటారు. మహాభారతంలో ఒక చిన్న కథ - ఒక బ్రాహ్మణుడు ఉన్నాడు. తన యజ్ఞ యాగాదులు అతను చేస్తున్నాడు. క్రతువులు చేశాడు. వేదాధ్యయనం చేశాడు. సమస్త (షట్) శాస్త్రములు చదివాడు. ఆయనకు 12 సంవత్సరముల కుర్రవాడు ఉన్నాడు.

ఒకనాడు అతడు తండ్రి దగ్గరకు వెళ్ళి "నాన్నా! మీరు అనుసరించే విధి విధానములు ఏమిటి ? అని అడిగాడు. మీ జీవన ప్రణాలిక ఏమిటి? అని అడిగాడు. మీరు ఏమి చెయ్యాలనుకొని ఇవన్నీ చేస్తున్నారు? అని. అంతట ఆ తండ్రీ "ఏమున్నదిరా నీకు తెలియదా ! వేధాద్యయనం చేస్తాము, యజ్ఞయాగాది క్రతువులు చేస్తాము. దేవతలను సంతృప్తి చేస్తాము. దేవఋణం, పితృఋణాదులను తీర్చుకోవడానికి గృహస్థ ధర్మంలో ఉంటాము. సంతానం కంటాము. సంతానానికి కావలసిన సంస్కారాలన్నీ చేస్తాము. పితృదేవతలను సంతృప్తి పరుస్తాము. దాన ధర్మాలు చేస్తాము. ఇవన్నీ అయినాక మేము సన్యాసులమై అరణ్యాలకు పోయి తపస్సు చేసుకుంటాము. అని పల్కాడు. ఆ మాటలకు ఆ పిల్లవాడు ఓహో యని పకపకా నవ్వాడు. "ఏమిరా ! నా మాటలు నీకు అర్థం కాలేదా ? ఎందుకు పకపక నవ్వుతున్నావు ?" అని ఆ తండ్రి కుమారుని ప్రశ్నించాడు. "ఇవన్నీ చేయడానికి ఇంత కాలం ఉంటుందని మీకు ఎవరు చెప్పారు" ఇంత సమయం ఉంటుందని నమ్మకమేమిటి ? ఇదంతా చేసిన తర్వాత గాని తపస్సుకు వెళ్ళరన్నమాట? ఈ

కాలమంతా ఈ ఆయుర్దాయమంతా మీ వశమై మీచేతుల్లో ఉన్నదని మీరు అనుకుంటున్నారన్నమాట. ఆ మాట నాకు అర్థం కాక అడిగాను" అని ఆ పిల్లవాడు నవ్వాడు. అప్పుడు ఆ తండ్రికి స్ఫూర్తి వచ్చింది. నిజమే ఇప్పుడు సాగుతున్నది కనుక ఇంకా సమయమున్నదని అనుకుంటున్నాను. ఎప్పుడు, ఎలా ఏ యజ్ఞం చేస్తుండగా పూర్తి కాకుండానే పోతానో, ఉంటానో నాకే తెలియదు కదా ! ప్రణాళిక ఏమిటి ఇంక బుద్ధికి ? అమ్మ దగ్గరకు వచ్చిన తరువాత అమ్మని అనుసరించి అమ్మ రూపం, అమ్మ వాత్సల్యం, అమ్మ చిరునవ్వును, ఆ వాత్సల్యమూర్తిని మనసులోని తలచుకుంటూ ఉంటే ఇక మనకు వేరే తపస్సు ఎందుకు ? మనస్సే తపస్సు అవుతుంది మనిషి రూపంలో అమ్మలో ఆ పరమాత్మ ఉంది మాతృరూపంలో ఉన్నది. అట్టి అమ్మను ధారణ చేయాలి. ఏదైనా కోరిక కోరాలి అన్నప్పుడు. ఏ కోరిక కోరిన తర్వాత మరే కోరిక ఉండదో అట్టిదే జ్ఞానేచ్ఛ. అట్టిదే మోక్షేచ్ఛ. దాని కొరకే అమ్మ వచ్చింది.

ఆ ప్రసాదాన్ని మనం ఎందుకు వాడుకున్నా అది మన యోగ్యత, మన అదృష్టం కావచ్చు. వెళ్ళగానే భోజనం పెడతారు. చాలా బాగున్నదమ్మా కడుపునిండా భోజనం తిన్నాము అని అంటాము. అన్నం తిన్న తర్వాత ఆరోగ్యం కూడా బాగున్నదమ్మా అని సంతోషిస్తారు. అమ్మ నవ్వుతూ "సంతోషం" అని అంటుంది. మనం అల్ప సంతుష్టులం. అల్పము సృష్టించినదే ఈ ఆరోగ్యం. నిన్న కడుపు నొప్పి వచ్చి ఇవ్వాళ తగ్గితే అది బ్రహ్మాండంగా, ఆనందంగా భావిస్తాము. మళ్ళీ అది రేపు రాదనే గ్యారంటీ ఏమీ లేదు. ఇందులో మనకు అల్పత్వ మనేది ఉండటం చేత మనం ఏ విధంగా ఆ ప్రసాదాన్ని అన్వయించుకొని అమ్మతో చెప్పినా, పిల్లల మాటలను చూచి విని నవ్వేది. ప్రత్యక్షంగా పరోక్షంగా అమ్మ లీలలు అందరికీ తెలుసు. ఒక ఎద్దు ఇలా ముట్టుకొని "ఇంకా ఉన్నావురా నీవు" అన్నది. ఆ ఎద్దు పూర్వజన్మలో అనేక కష్టాలు అనుభవించి అక్కడ నిలబడి ఉన్నది పశువు రూపంలో. దానిని బండికి కట్టి బండివాడు లాగిస్తున్నాడు. తక్షణమే ఆ ఎద్దు శరీరం వదిలి పెట్టింది. ఇలాంటివి చాలా ఉన్నాయి. అన్నింటికీ కాలస్వరూపిణియై తాను ప్రత్యక్షంగా వచ్చి, అసహాయస్థితిలో ఉన్న జీవులను, ఎటువంటి సాధనా చేయలేని

జీవులను, ముక్తిని అనేక జన్మల నుండి కోరుకుంటున్న వారిని తాను తీసుకెళ్ళడానికి వచ్చినదని ఋజువు చేస్తూ మనకు కన్పడుతుంది. అయితే అమ్మ మరలా వస్తుందా? ఎందుకు వస్తుంది ? ఎప్పుడొస్తుంది ? అంటే అసలు వెళ్లితే కదా మళ్ళీ రావడానికి. అందుకని ఉన్నదిక్కడ. ఆ స్థితిలో ఇక్కడ ఎవరైతే దానిని ఎవరు ఉపయోగించుకుంటారో ఆ సన్నిధి వాళ్ళకు ముక్తి హేతువు. అనేక దేవతా క్షేత్రాలున్నాయి. లక్ష్మి ఆలయాలున్నాయి. ధనం కావాలని అక్కడకు వెళ్తాము. భయమేస్తే దుర్గా ఆలయాలకు వెళ్తాము. అయితే ఆ దేవతలు ముక్తి నివ్వరా అంటే మనం వారికి ముక్తిని అడగడం లేదు, ఆ రూపం, అదంతా చూసి. ఇంకేదో అడుగుతాము. ఇంకో చోటికి వెళ్తాము. ఆరోగ్యం కొరకు, సూర్యాలయానికి వెళ్తాము. వీరు ముక్తి నివ్వలేరని కాదు. ఆ రూపములు, ఆ గణములు, ఆ సగుణ స్వరూపములు ముక్తిని వాంఛిచేటట్లు చేయవు. వేరే మాయలోకి తీసుకెళ్ళి, వేరే కోర్కెలు కోరుకునేటట్లు చేస్తుంది. అమ్మ అలా గాదు. అందుకనే తను ఎవరో, ఏ రూపమో, ఏదేవతో చెప్పకుండా 'అమ్మ' అని తన పేరు పల్కింది. ఒకటే పేరు. "దగ్గరకు తీసుకోవాడానికి వచ్చిన అమ్మ" ఆమె. ఆ దృష్టితోనే మనం ఉండాలి. చిరంజీవులు చదువుకుంటున్నారు, భక్తులు సేవ చేస్తున్నారు, కష్టపడుతున్నారు. శ్రమపడుతున్నారు ధన్యులందరూ ఇక్కడ. అమ్మ దగ్గరకు వచ్చారు.

ఇక్కడ నుండి మరొక అన్వేషణ ఉండదని బాగా గుర్తు పెట్టుకోండి. మరి పిల్లల మాటేమిటి ? వారు ఇవన్నీ కోరుకొని వచ్చారా ? అయితే వాళ్ళ జన్మ సార్థకమైంది. వాళ్ళ చదువుకున్న విద్య, వాళ్ళ సంస్కారం జీవనం సార్థకమై వాళ్ళు శాశ్వతంగా ఋణముక్తులౌతారు. ఋణం నుండి విముక్తులను చేసే ఒక శక్తి ఈ క్షేత్రంలో అమ్మరూపంలో వుంది. ఈ క్షేత్రంలో అమ్మను నమ్మకంగా సేవ చేసే వారికి ఈ జన్మ సరిపోతుంది. ఇది నా నమ్మకం, విశ్వాసం. అమ్మ జీవుడిని మాత్రమే చూసేది. లేకపోతే ఆరు ఏళ్ళ పిల్ల, ఆలనా పాలనా లేకుండా తిరుగుతూ ఉండే పిల్ల తనకు ఆకలేస్తున్నదంటే పక్కింటి ఆవిడ దగ్గర అన్నం అడిగింది. పిల్లలకు పాలిస్తున్న పందికి అన్నం తినిపించింది. ఎవరైనా చేయగలమా మనము ? మనకు పంది అంటేనే అసహ్యము. ఆమె పందిని చూడలేదు. అందులో

మాతృత్వము, ఆ పిల్లలు పాలు త్రాగటం. అందులో జీవుడిని చూచింది. మనం అమ్మ ముందర, నిలచున్నప్పుడు మనం కళ్ళలోకి ఆమెను చూస్తుంటే ఆమె మన అంతర్యాన్ని మన జీవుడిని చూస్తుంది. ఆ స్థితిలో ఉన్నది అమ్మ. యోగ పరిభాషలో దాన్ని 'సహజ సమాధి' అంటాము. 'రమణునిది సహజ సమాధియే' ఆమె శరీరాన్ని విడిచిన తరువాత ఈనాడు ఆ సహజ సమాధి స్థితిలో జగత్తంతా వ్యాప్తి చెందిన మహా చైతన్యంతో ఒక అంతర్భాగంగా ఇక్కడ శాశ్వతంగా ఉన్నది. దేవతలు మరల అవతరిస్తూ ఉంటారు. లోకానికి ఉపకారం చేస్తుంటారు. బాగానే ఉన్నది. వారు తపస్సు చేస్తూ ఉండవచ్చు. సత్సంకల్పంతో మళ్లీ మళ్లీ పుడుతూ ఉంటారు. పుట్టిన తరువాత వెళ్ళడం అనేది ఉన్నది. మళ్ళీ వస్తూ ఉంటారు. ఈ లోపుగా తపోలోకం, దేవలోకం పైన ఉన్నాయి. ఆయా లోకాలకు వెళ్తారు. మళ్ళీ వస్తారు. 'అమ్మ' అంతటా వ్యాపించిన తరువాత నిష్క్రమణ అనేది లేదు. ఈ అర్థంతో అమ్మను మనం బాగా అవగాహన చేసుకున్నట్లయితే మనకింక ఏదీ తరువాత కార్యక్రమమంటూ ఉండకూడదు. ఉన్నదని అనుకుంటే మనము అక్కడకు వెళ్ళిన తర్వాత ఏ మహాఫలాన్ని పొందామో అది గుర్తించక, కడుపునిండినా, జేబు నిండినా ఏదో ఫలాన్ని ఆశించి వెళ్ళే వాడిలా ఉంటుంది.

మళ్ళీ ఇక్కడకు వచ్చిన తరువాత 'ఉత్తీర్ణత', జీవునకు కోరుకో దగిన వస్తువేదైతే ఉన్నదో అది లభించినట్లే భావించినవారు, ఆ యధార్థస్థితిని ఈజీవితంలోనే, చరమ దశ అయినా అమ్మ దర్శనం వల్ల తను ఉత్తీర్ణుడైనాననే ధైర్యం అనుభవం అవుతుంది. అది జన్మహేతువు లేకుండా చేస్తుంది. ఇచ్చిన మాట చేత భాష ఏమైనా ఏమి చేసినా ఈ జీవుడిలో ఉండే సంస్కారాలను పూర్తిగా అమ్మ తీసివేసుకుంటుంది. సంస్కారములు పోయిన తరువాత ఇక ఉత్తర జన్మకు కారణమే లేదు. కర్మలున్నాయి, కర్మఫలాలున్నాయి కర్మఫలము యొక్క జ్ఞాపకాలున్నాయి. అవే సంస్కారాలు. అవన్నీ ఎప్పుడైతే ఆమె తీసేసుకున్నదో జన్మకు బీజమే, కనిపిస్తుంది. అమ్మతో అటువంటి అనుబంధము మనలో మనము ఏర్పరచుకుంటే తపస్సు, ధ్యానము, అదే యోగము. మీరు ఏ పేరు అయినా పెట్టుకోండి. అమ్మను వదలకుండా మనసులో ధ్యానించడం చేత మనకు ఆ స్థితి వస్తుంది. యధార్థంగా, నా అంతః

కరణలో నేను నమ్మిన విషయం ఇది. ఆదరం అందరికీ చూపించింది. ఆదరణ యొక్క అర్థము ఇలా అర్థం చేసుకోవాలి. ఏదో అమ్మ ఆశీస్సు దొరికింది మా అమ్మాయికి పెళ్ళి అయింది. ఎలాగైనా దూరంగా అమ్మను స్మరించినా అమ్మాయి పెళ్ళి అయిపోతుంది. విశ్వాసము ప్రధానము. అమ్మ దగ్గర ఉంచి ఆ ప్రసాదాన్ని తీసుకుంటే ఆనాడు అమ్మ చేతుల మీదుగా ప్రసాదాన్ని తీసుకున్నప్పుడు ఏ ఫలము వచ్చినదో అదే ఫలము ఇప్పుడూ వస్తుంది. అయితే విశ్వాసము ప్రధానము. ఎందుకంటే ఉన్నది కాబట్టి. ఈ క్షేత్రం లయ స్థానం. జనాకర్షణ, పేరు ప్రతిష్ఠ వుంటాయి ? అక్కడికి వెళితే మొక్కు బడులు అవి ఉన్నాయి, ఆ క్షేత్రాలు వేరే ఉన్నాయి, అక్కడ రోజుకి కోటి రూపాయల ఆదాయం వస్తుంది. చాలా గొప్ప విషయం. అది వేరు. ఎందుకంటే ఇది కోరుకుంటూ వచ్చేవారు ఎంతమంది ? ముక్తి కోసం నేను చాలా సాధన చేస్తున్నాను. యోగం చేస్తున్నాను, ప్రణవం చేస్తున్నాను' చాలా బాగుంది. కాని దొరికే చోటుకి వెళ్ళి తీసుకోవడం తెలివైన పని ? ఇది ఇంట్లోనే వుండి శ్రమపడకుండా, వచ్చే అలాంటి క్షేత్రం. కాబట్టి మనం ఈ క్షేత్రాన్ని అమ్మ సంకల్పంతో ఎంత వృద్ధి పొందుతుందో అంత చేయాలి. అతిథి అభ్యాగతులకు ఇంత ప్రసాదం పెట్టే ఏర్పాట్లు భక్తులు చేస్తున్నారు.

వ్యయ ప్రయాసలు రెండూ ఉన్నాయి అందులో. కాని ఇంక ఏ సేవ చేయగలము అమ్మకు ? ఏ సేవ చేయలేము. కాబట్టి ఇదిగో ఆ బిల్డింగు కడతాము. ఇక్కడ భోజనాలు ఏర్పాటు చేస్తాము. ఇంతకన్నా చేయగలిగిందేమీ లేదు. ఈ సేవ చేసే వాళ్ళంతా కూడా పెద్ద యజ్ఞాలు చేస్తున్నట్లే లెక్క. అమ్మ కోసం వచ్చిన వాళ్ళకి అన్నం పెట్టటం. అమ్మా !యిదిగో మేము వండి నీకు చూపించి వాళ్ళకి పెడుతున్నాము. నువ్వు ఇక్కడ శరీరంతో కనపడుతున్నప్పుడు ఏ ఫలం వాళ్ళకి యిచ్చావో యిపుడూ ఆ ఫలం ఇస్తావన్న విశ్వాసవంతో మేము అన్నం పెడుతున్నాము. మేము అంతకన్నా ఏమి చేయలేము అని చెప్పడం మన కర్తవ్యం. అమ్మ చూస్తున్నది. ఈ జగత్తంతటికీ కూడా ఈ కాలంలో కలియుగంలో అమ్మ కాళి యొక్క అవతరణ. యావద్భారత దేశంలో ఈ ప్రణాళికలో ఈ రూపంలో ఒకసారే వచ్చింది. అది నా నమ్మకం. ఇంతకు పూర్వమెన్నడూ రాలేదు. కాళీ ఉపాసన బెంగాలీలు చేస్తున్నారు.

చేస్తూనే ఉంటారు. కాళీ పేరు పెట్టుకుంటారు. బాగుంది. కాళీ ఉపాసన చేస్తారు కాని శక్తి కావాలంటారు. ఊర్ధ్వలోకాలు కావాలంటారు ఏవేవో కావాలంటారు. మనుషులు కోరే సమస్త యిచ్చలూ కూడా యివ్వాలంటే బ్రహ్మదేవుడు అక్కరలేదు. విష్ణువు అక్కరలేదు, శివుడు అక్కరలేదు, అమ్మా అక్కర్లేదు. మనం కోరే కోరికలన్నీ కూడా ఒక సామాన్య గంధర్వుడివ్వవచ్చును. వాని చేతిలో వున్నాయి. మన కోర్కెలివ్వడానికి సర్వ సామాన్యమైన అనేక కోట్ల గంధర్వులున్నారు. ఏ ఒక్కడైనా యివ్వచ్చు. ఒక విద్యాధరుడివ్వవచ్చు. సర్వ సామాన్యమైన దైవాంశ ఏదైనా యివ్వవచ్చు. 'దేహి దేహి భోజనం దేహి రాజేంద్రా ! అంటామా? మహారాజు దగ్గరకు వెళ్ళి మహారాజును ఈ రోజు భోజనం పెట్టమని అడుగుతాడా ఎవరైనా ? మనం అలా చేస్తున్నాము. ఈశ్వరుడి యొక్క తత్వం, వాని వైశాల్యం సంపూర్ణత్వం గుర్తించక ఎక్కడో పరమేశ్వరుని దగ్గరకు వెళ్ళి నా పొలంలో దావాలున్నాయి కాస్త తీర్చమని అడుగుతాం. విచిత్రం.

అమ్మ నడగడానికి ఏది అడగాలో తెలిసిన వారు, వారు వివేక వంతులు, వాళ్ళు ఆ ఫలం పొందుతారు. అందుకని మనం అడగడం లోనే వివేకం కావాలి. అడిగితే చాలా ! ఏమీ చేయ్యక్కర లేదా ! అడుగుతూనే వుండాలి రోజూ. అందరూ చాలా సందేహాలు అడుగుతుంటారు. మోక్షంకావాలంటే ఏమి చేయాలి? భగవంతుని వేడుకోవాలి. ఎంత సేపు వేడుకోవాలి ? రోజూ అరగంటో ముప్పావు గంటో. తరువాత మళ్ళీ ఈ లోకంలోనే వుంటాము. నిజంగా కావాలంటే ఓ మహాయోగి సమాధానం చెప్పాడు ఏమి చేయాలని అడిగితే నీ దగ్గర మనుమలు, పిల్లలు ఉన్నారు కదా ! వాళ్ళేదో బిస్కట్లు కావాలనో ఏదో అడిగితే మారాం చేస్తారు చూడు, వెంటనే యివ్వకపోతే నువ్వు యిచ్చే దాకా క్రిందపడి దొర్లి ఏడుస్తారు కదా ! వాళ్ళు సాధిస్తున్నారు కదా ! అలాగే ఈశ్వరుడి దగ్గరకు వెళ్ళాలి. ఇచ్చేదాక వదలకూడదు. మారాము చేసి పిల్లలు తల్లి దగ్గర కోరిక ఎలా తీర్చుకుంటారో అలా తీర్చుకోవాలి. అదీ నిజమైన అడిగే వాళ్ళ లక్షణం అయి వుండాలి. అమ్మను కూడా అలాగే అడగాలి. ఇంకేవో కర్మఫలాలు, ఈ జన్మకు యింకా మిగిలి ఉన్నాయి. ఇంకా నాల్గు జన్మలున్నాయి. ఇలాంటివి ఎప్పుడైతే మనసులో అనుకుంటామో ఆ

భావమే బంధన అవుతుంది. నాకు జన్మలేదు. అనుకున్నవాడు ముక్తుడు. ఇక్కడున్నాను కాబట్టి ఇక అయిపోయింది నా ప్రయాణం అనుకున్న వాడు ముక్తుడు. ఏమో! ఇంకా ఎన్ని జన్మలున్నాయో అమ్మ దయతో ఉత్తర జన్మకయినా జ్ఞానం రావాలి - ఇలా అనుకోకూడదు. సంకల్పమే అనుకోవాలి. ఆ ఉత్తీర్ణత దృఢమైన సంకల్పంలో, విశ్వాసంలో వుంటుంది. ఏ విధంగా మనం సంకల్పిస్తామో, ఎలా విశ్వసిస్తామో, ఆ విశ్వాసంలో ఎంత దారుఢ్యమున్నదో అంతఫలం వెంటనే వస్తుంది. సందేహం చేతనే మనుషులు దగ్గరకు వచ్చినపుడు కూడా అమ్మ ఆదరిస్తుంది. సందేహం మనిషికి సహజమే. అయినా తల్లి దగ్గరకు వచ్చిన తరువాత నాకు యిచ్చ తీరుతుంది అనే నమ్మకంతో కదా పిల్లవాడు ఏడుస్తాడు. వాడికిస్తుందని నమ్మకం అందుకే మారాము పెట్టి తీసుకుంటాడు. ఆ స్థితి తల్లీ బిడ్డల వలె కన్నబిడ్డ కాదు, తీసుకునే బిడ్డ. తీసుకునే తల్లి. కనిపెంచేటటువంటి బిడ్డ కాదు. ఇంకా బాగా చదువుకో ఇంకా సుఖంగా వుండు అని తల్లి అంటుంది. అంటే వాడికి బాగా సంతానం కావాలి. దీర్ఘాయువుతో ఉండాలి ఇది సామాన్యమైన తల్లి భావం. తీసుకోవడానికే వచ్చానని ఈ యమ్మ భావం.

ఈ విషయంలో బాగా గుర్తు పెట్టుకునేటట్లయితే ఎలాంటి క్షేత్రం యిది. ఒకటే యున్నది. ఈ యుగంలో యదార్థమైన శుభేచ్ఛ, మోక్షేచ్ఛ కలిగి మరి యే యితర సాధనా చేతకాని వాడు ఎవడైనా సరే, చేతనవుతుంది సాధన అంటే, సాధన వలన వస్తోందా ఫలం ? సాధన వలన ఏ ఫలం రావడం లేదు. ఈశ్వరానుగ్రహం చేత వస్తుంది. వానికి చేతనైన సాధన వాడు చేస్తున్నాడు. దానికి ఫలం ఇచ్చే ఈశ్వరుడు విశాల హృదయుడు, దయామయుడు కాబట్టి వస్తుంది. సాధన లేకుండా కూడా యివ్వగల దయ ఈశ్వరుని కున్నది. కోరిక కోరగానే యివ్వగల శక్తి ఆయన కున్నది. పురాణాలు చెపుతున్నాయి అలాగా. వేదములలో కూడా అలాంటి పాత్రలను గురించి చరిత్రలున్నాయి. ఋగ్వేదంలో కూడా అలాంటి చరిత్రలున్నాయి. మనం కోరిన వెంటనే మహా పాపాలు చేసిన వాడు కూడా శాశ్వతంగా నరకానికి పోయే వాడు కూడా ఒక్క క్షణంలో ముక్తిని పొందినాడని కూడా వుంది. అసాధ్యమేమీ కాదు. ఈశ్వరానుగ్రహం అంతటా వ్యాపించి వుంది.

నేడు అమ్మదయ మన అందరి యందూ వుండాలి. మనకి మళ్ళీ సందేహాలు పుట్టకూడదు. ఎన్నడూ కూడా నా స్థితి అమ్మ దగ్గరకు వెళ్ళిన తరువాత నన్ను గురించి నాకు సందేహం పుట్టకూడదు. అలాంటి స్థైర్యం, విశ్వాసం నాకివ్వవలసినదిగా కూడా అమ్మను అడిగి క్షతి లేనటువంటి ఉత్తమ మార్గంలో అమ్మను కలవడం భక్తునికి ధర్మం. ఈ అవకాశం నాకు ఇవాళ కలిగింది. ఈ క్షేత్రం చూచాను. చాలా తృప్తి కలిగింది. ఆనందం ఉందిక్కడ. ఇది కూడా నేనన్నట్లు కాశీ ముక్తి లాంటిదే. మళ్ళీ యింటికి వెళ్ళేది కాదు. క్షేత్రాలలో యిది ఒకటి. కాశీ వుంది, ఇది వుంది. అలాంటి క్షేత్రం యిది. కాబట్టి ఇక్కడకు వచ్చిన వాళ్ళందరూ ధన్యులు. ప్రతివాడూ కూడా ఒక యజ్ఞం చేసే ఋత్విక్కులాగానే ఉన్నారు. కాబట్టి ఈ యజ్ఞం ఎప్పుడూ కొనసాగునుగాక. అమ్మ అనుగ్రహం మోక్షేచ్ఛ కల్గిన వారందరికీ కూడా కల్గును గాక. అని అమ్మను మరొక్కమారు నమస్కరించి వేడుకుంటూ మీ అందరికీ శుభాకాంక్షలు తెలియ చేయుచున్నాను.



అమ్మ గురువు - దైవం

ఈ యుగంలో మనుషులకేదో తరుణోపాయాన్ని చెప్పగలిగినటువంటి వారిని అవతారపురుషులుగా భగవంతుని అంశలుగా మనం ఆరాధిస్తాం. అంటే మోక్షమార్గాన్ని, ఆరాధించాం కానీ పాండిత్యాన్ని కాదు. యజ్ఞయాగాది క్రతువుల్ని కూడా గౌరవించామే కానీ ఆరాధించలేదు. ఇది మన సంస్కృతి. అందుకనే ఏ చదువున్నా లేకపోయినా సామాన్యుడైనా, పేదవాడైనా ఏ కులస్థుడైనా - భగవంతుని నమ్ముకుని జీవితం అంతా ఈశ్వర ఆరాధనలో గడిపి భక్తిమార్గంలో ఉండి మానవధర్మాన్ని పాటించిన వారిని మనం ఆరాధిస్తున్నాము. అలాంటి వారికే గుళ్ళు, గోపురాలు, సమాధులు, స్తోత్రాలు, ఆరాధనలూ చేస్తున్నాం.

ఆకోవకు చెందిన వ్యక్తులు ఆ నాడూ ఈనాడూ కూడా భారతదేశంలో పుడుతూ ఉన్నారు. వాళ్ళని నమ్ముకున్నవాళ్ళు కొన్ని వేలమంది తరిస్తూ వచ్చారు. జిల్లెళ్ళమూడి అమ్మగారు గొప్ప వేద పండితురాలని గౌరవిస్తామా? అవసరం లేదు. వాటన్నిటికీ అతీతమై ఇంకా పై అంతస్థుకి వెళ్ళిన జ్ఞానము యొక్క అంశ. ఈశ్వరునికి అనంతమైన శక్తి ఉంది, అనంతమైన జ్ఞానం ఉంది. ఒక్కొక్క లక్షణంతో ఒక్కొక్క జీవుడు పుట్టి ఆవిషయంలో ఈశ్వరుని అంశగా అతడు ఆరాధింప బడతాడు.

జిల్లెళ్ళమూడి అమ్మ పరమేశ్వరుని యొక్క అంశ. ఎందులో అంశ? రామకృష్ణాదుల వలె సంహారశక్తి ఉందా? అదికాదు. మోక్షమార్గాన్ని చూపించేటప్పుడు ఒక శక్తివంతుడైనటువంటి ఈశ్వరుడుగా ఆరాధించడం కంటె కూడా మాతృమూర్తిగా వాత్సల్యంతో సమస్తజీవకోటి యందు సమానమైన ప్రేమ, ఆదరము, దయ, కారుణ్యము కలిగిన మాతృమూర్తిగా తాను కనబడటం మాతృత్వం అనేటటు వంటిది ప్రతీజీవునికి ఆనందదాయకం, సులభంగా ఆరాధించదగిన వస్తువు. కాబట్టి అందరూ తల్లిగా తనను చూసుకొని తనను ఆశ్రయిస్తే, వాళ్ళ అజ్ఞానం వాళ్ళ అవిద్య వాళ్ళ కర్మలు ఎలా ఉన్నా, వాళ్ళను మంచిమార్గంలోకి తీసుకొచ్చి వాళ్ళకి ముక్తిమార్గాన్ని చూపించటం కోసం పుట్టినటువంటి విశేషమైన అంశే అమ్మ.

ఆమె ఒక కొత్త విధానమేదో సూచించి, ఏదోధ్యాన మార్గం కొత్తది బోధించి లేక కొత్తమతాన్ని స్థాపించి, ఒక Institution ఏదోప్రారంభించి.... అలా చేయలేదు. ఆమెకొక సంస్థ లేదు; ఆమె కొత్తగా చూపించినటువంటి బోధలు, ఆమె వ్రాసినటువంటి గ్రంధాలు అలాంటివేమీ ఉండవు. దేశంలో జీవులకి ఏం కావాలో ఆమెకి తెలుసు. ఏది సులభంగా వాళ్ళు తన నుంచి తీసుకుంటారో అది కూడా తనకి తెలుసు. కాబట్టి మాతృమూర్తిగా అక్కడ అమ్మ ఉంది.

ఇంకా వివరంలోకి వెళ్ళాలంటే - ప్రశ్నలు పుడతాయి; శివునియొక్క అంశా? గణపతి అంశా? ఇలాంటివి. జగన్మాత - శాక్తం అంటాం, దానిని మాతృమూర్తిగా ఈ సృష్టియొక్క చైతన్యాన్ని మనం ఆరాధిస్తాం. లలితాసహస్రనామాల్లో 'శ్రీ మాత్రే నమః' మొదటి పేరు. అంటే జగన్మాత శ్రీమాత - ఆ అమ్మకు నమస్కారం అని అర్థం. ఆ తర్వాత రాక్షస సంహారం చేసింది. యోగంలో ఇలా ఆరాధిస్తారు. మంత్రస్వరూపిణి అని. కాబట్టి మొదటి నామం 'శ్రీమాత్రేనమః', మాతృశబ్దం చేత పరాశక్తిని ఆరాధించటం ఒక సంప్రదాయం. ఆ మాతృతత్త్వం ఏదైతే ఉన్నదో అది మానవస్వరూపంలో మన ఎదురుగుండా వచ్చినటువంటి ఒక రూపమే జిల్లెళ్ళమూడి అమ్మగారు-మాతృమూర్తి.

మాతృమూర్తి అంటే - ఎవరైనా యుద్ధం చేస్తే 'నాకు జయం కలగాలి' అంటే వాళ్ళ కేదో ఆశీర్వచనం ఇవ్వటం ... అలాంటిది కాదు. ఏ మార్గంలో తల్లిగా తాను ధ్యానాన్నిచ్చి, చివరి దశకు తీసుకువెళ్ళి కర్మను ఉత్తర జన్మను తరింపజేసి మోక్షాన్నీ, జ్ఞానాన్నీ ఏ విధంగా జీవులకు రావాలో ఆ మార్గాల్నే సూచించినటువంటి దేవి, అమ్మవారు. లేకపోతే 'కాళి' ఉంది, మహాలక్ష్మి ఉంది, దుర్గ ఉంది - ఒక్కొక్క కార్యార్థం ఒక్కొక్కదేవతను ఆరాధిస్తాం. శతృభయం కలిగితే దుర్గను, దారిద్ర్యం వస్తే శ్రీమహాలక్ష్మిని ... ఏవో కోరికలతో ఒక్కొక్క రూపాన్ని ఆరాధించటం మన సంప్రదాయం.

జిల్లెళ్ళమూడిలో అమ్మ ఆ జగన్మాతృస్వరూపమైనటు వంటి పరాశక్తి; మాతృత్వం అనేటటువంటి భావంతో ఇక్కడ మనకి ఎదురుగుండా సాక్షాత్కరించింది.

తల్లి కనక పరదేవత అయితే, పరదేవతే మనకి తల్లి అయితే ఏ విధంగా మనం ఆ అమ్మ వల్ల లాభం పొందుతామో ఆ లాభాన్ని మనందరికీ ఇవ్వడానికి ఆమె వచ్చింది.

కొందరుపూర్వజన్మలో చాల ఉపాసనలు చేసి, ఉపాసన ఫలితంగా దైవాంశతో పుడతారు. అది పూర్వజన్మ సంస్కారం వల్ల వాళ్ళు ఆ రూపంలో అలా బోధిస్తున్నారు. అలాంటి ఏవో దేవీ ఉపాసనలు చాలా జన్మలు చేసి ఆ దేవీ స్వరూపంగా 'నేను కాళిని', 'నేను అన్నపూర్ణను' అలా కాకుండా, కేవలం శుద్ధ చైతన్యస్వరూపుణి అయినటువంటి జగన్మాతృమూర్తి అయినటువంటి పరాశక్తి యొక్క స్వరూపమే తల్లిగా మన దగ్గరికి వచ్చింది.

తిరిగి తిరిగి అన్నిమాటలు చెప్పాల్సి వస్తోంది. కారణం ఏమిటంటే - అవతారం అంటే, ఏ దేవి అవతారం? గణపతి అవతారమా? సుబ్రహ్మణ్యేశ్వరుని అవతారమా? అటారు. అవతారం అంటే పైనించి క్రిందికి దిగటం అని అర్థం. ఎక్కడ నుంచి క్రిందికి దిగుతారు? ఊర్ధ్వ లోకాలనుంచా? అవసరం లేదు. అన్ని దేవతల యొక్క మంత్రములు, తత్త్వములు ఈ భూమి, ఆకాశము అంతటా అన్ని చోట్ల వ్యాపించి ఉండటం చేత దానిని ఉపాసించిన వారు భూమి మీద పుట్టవచ్చు. అలా ఉపాసన విషయం కాదిక్కడ. అమ్మ సాక్షాత్తు ఆ పరా శక్తి యొక్క అంశ. తనంతట తానే వచ్చింది గాని, ఒక తపస్సు పూర్వజన్మల ఉపాసన దాని ఫలంగా తాను అంటే కర్మవశాత్తూ పుట్టిన జీవుడు కాదు. తన కర్మవల్ల తాను పుట్టినది కాదు.

మరి ఎందుకొచ్చింది? ఎలా వచ్చింది ? అంటే - ఎప్పుడూ కూడా మనుష్యులు లోకంలో భగవంతుని అనేక రూపాల్లో ఆరాధన చేసుకుంటూ ఉంటారు. ప్రజలు, మనుష్యులు, భక్తులు, కష్టాలు, ఆర్తితో ఉండేవాళ్ళు ప్రార్థిస్తేనే ఈశ్వరుని యొక్క అంశలు మానవ స్వరూపంలో ఎదురుగుండా మనకి వస్తాయి. ఇది మనం అడిగి తెచ్చుకునే విషయం; మన ప్రార్థన వలనే వస్తుంది; అలాగే ఒక మార్గం "నన్ను తల్లిగా చూడండిరా, మీకింకేం అవసరం లేదు. నా మంత్రం ఏమిటి? నా ఉపాసన ఏమిటి? నాది శ్రీచక్రమా లేకపోతే ఆ యంత్రమా? ఈ రూపమా? ఇవేం అవసరం

లేదు. అమ్మా ! అమ్మా! అని నన్ను పిలవండి. నా వల్ల మీకు ఏది అతిముఖ్యమైనదో అది ఇస్తాను" అని మౌనంగా మనకి చెప్పినది అమ్మ.

తల్లి ఏం చేస్తుంది ? వెంటనే ఇంత అన్నం ముద్ద చేతిలో పెట్టి 'తినరా' అంటుంది; ప్రసాదం పెడుతుంది. "అన్నం తిన్నావా?" అని అడుగుతుంది. అదంతా అమ్మ లక్షణం. దైవస్వరూపం, జ్ఞానస్వరూపం కంటే కూడా ఒక తల్లిగా మాట్లాడిన వ్యక్తి ఆమె అందరితో. ఆమెకు ఆంధ్రదేశంలో పుట్టడానికి కూడా అనేకమంది యోగులు, మంత్ర ఉపాసకులు, దేవీ ఉపాసకులు అనేకమంది ఆ కృష్ణాగోదావరీ తీరాల్లో కొన్ని వందల సంవత్సరముల నుంచి మానవ కల్యాణం కోసం తపస్సు చేస్తూ ఉన్నారని నా నమ్మకం – వాటి ఫలితంగానే అమ్మ వచ్చింది.

ఎప్పుడూ కూడా ప్రార్ధన చేస్తేనే వస్తుంది కానీ తనంతట తాను రావల్సిన అవసరం లేదు. కానీ ఈశ్వరునికి 'అనుగ్రహ స్వరూపుడు' అనిపేరు. ఈశ్వరునికి ఒకటే గుణం ఉంది – అనుగ్రహం. అనుగ్రహం అంటే – మనం అడిగింది ఇవ్వటం అని కాదు. అవసరమైతే శిక్షించి కూడా రక్షించటం అనుగ్రహం. చిన్నప్పటినుంచీ తల్లి శిక్షించింది, తండ్రి శిక్షించాడు, గురువు శిక్షించాడు. ఎంతోమంది బోధించారు, తప్పుచేస్తే కొట్టారు, తిట్టారు మనల్ని – అనురాగంతో అనుగ్రహంతో చేసిన పనే కానీ ఆగ్రహంతో కాదు. ఆ అనుగ్రహం ఎప్పుడైతే మనకి వచ్చిందో ఆ జీవులు ఏ స్థితిలో ఉన్నా ఈశ్వరుని చేరు కుంటారు. జీవులు అంటే – వేద శాస్త్రములలో జీవులందరూ పశువులనీ, వీటన్నిటికీ పశుపతి ఈశ్వరుడనీ, జీవులను రక్షించేవాడు పాలించే వాడూ కనక పశుపతి అనీ పశుపాలకుడు అనీ ఒక దృక్పథం ఉన్నది. కాబట్టి జీవులంటే మనిషి శరీరంలో ఉన్నా, పశుశరీరంలో ఉన్నా జీవత్వం పశుత్వమే. జీవుడుగా తను భావించుకోవటమే – శరీరం మీద ఆధారపడి దానిని ప్రేమించుకుంటూ దానికి సంబంధించిన బాంధవ్యాలకి ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ధన ధాన్యాల కోసం అన్ని పనులూ చేస్తూ .... ఇవన్నీ పశుత్వం; అజ్ఞానం క్రిందే లెక్క.

పశువుకేమో తన పశుత్వాన్ని గురించి తెలియదు. తన పశుత్వాన్ని గురించి తనకి బాగా తెలిసిన వాడి పేరే మనుష్యుడు. పశువుకి తను ఉన్నట్టు కూడా తెలియదు దానికి. అందుకనే దానికి కామక్రోధాలేమీ ఉండవు. ప్రాణం కోసం యుద్ధంచేస్తుంది; చచ్చిపోతుంది. దుఃఖం లేకుండా బాధ పడుతుంది. మనుష్యుడు బాధ ఉన్నా లేకపోయినా, కోరిన కోరిక నెరవేరక పోయినా దుఃఖపడతాడు. పశువుకి దుఃఖం ఉండదు; బాధే ఉంటుంది. ఆస్థితిలో కూడా జీవులు అనేకమంది ఉంటారు ఈ లోకంలో.

ఆమె జీవితంలో ఒక ఉదంతం : ఒక చోట ఒక ఎడ్లబండిమీద ఎక్కడికో వెళ్ళాల్సి వచ్చింది. ఆ ఎద్దుని చూచి "నాయనా! ఇక్కడున్నావా! ఈ స్థితిలో ఉన్నావా!" అని ఆ ఎద్దులో ఉండే జీవుని గుర్తించడమేమిటి, తక్షణమే ఆ జీవుడు ఆ పశుశరీరాన్న వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. జీవులను చూస్తుంది శరీరాలలో – ఇందులో పురుషుడా, స్త్రీయా, ఏ దేశస్థుడు, ఏ గుణం .... అవేం చూడదు. జీవాత్మని స్వయంగా చూచి ఆ జీవుని యందు అనుగ్రహంతో దయతో మాతృభావంతో అనుగ్రహించడమే ఆమె స్వరూపం, స్వభావ లక్షణం.

ఈ దేశంలో కొత్త కొత్త మతాలు, సిద్ధాంతాలు ఎప్పుడూ పుడుతూనే ఉన్నాయి. సనాతన ధర్మంలో ... ఆ పరిధిలో ఉన్నటువంటి మతములన్నీ కూడా కొంత ఆదరం పొందాయి. దానిని తిరస్కరించి ఏదో 'కొత్తమతాన్నీ సిద్ధాంతాన్నీ నేను చెపుతున్నాను' అనుకొనేవారు చాలామంది వచ్చారు. కానీ అటువంటి సిద్ధాంతాన్ని గురించి – స్వోత్కర్ష– తన గొప్పతనాన్ని గురించి తన శక్తియుక్తుల్ని గురించి తన వాగ్దానాలను గురించి మాట్లాడక అడిగిన వారికి అడిగినది ఇవ్వటం; తన దగ్గరికి వచ్చిన వాళ్ళు భాగ్యశాలురు. ఆ స్థితికి ఎదిగిన వాళ్ళు. కష్టాల్లో ఉండేవాళ్ళు పూర్వజన్మలో చాలా ఆర్తితో నన్ను అర్థించిన వాళ్ళు నా దగ్గరికి వస్తారు, నేను వాళ్ళ కోసం వచ్చాను. "వీళ్ళు తరిస్తారు, వీళ్ళని చూసి ప్రవేశిస్తారు ఇతరులు" ఇది ఆమె భావం. తనను గురించి తను చెప్పాల్సిన అవసరం తనకి లేదు. అయితే అనేక రూపాలు దుర్గ, కాళి, మహాలక్ష్మి ...ఇవన్నీ ఉన్నాయి కదా! ఏ తత్త్వం ఆమెలో

ఎక్కువ ఉందని కొందరు అడిగారు నన్ను – ‘ఆమె మహాలక్ష్మి ? దుర్గ అమ్మవారా? అన్నపూర్ణా ? ఏమిటండీ దేవీ స్వరూపాల్లో ఏ రూపంలోంచి వచ్చిన స్వరూపం ఆమెది?’ అని.

అంటే అలా చెప్పటానికి నిజంగా వీలు లేదు. కాని ‘కాళీ’ అంశలో ఒక లక్షణం ఉన్నది. జీవుల్ని గుర్తించి వెంటనే తనలో కలుపుకోవడం; వాళ్ళను తనలో విలీనం చేసుకోవటం. అదే వాళ్ళకి ముక్తి హేతువు. ఇంకొక జన్మలేకుండా చేయటం. పశుజన్మ అంటాం. ‘మనుషుల కంటె పశువు ఏవిధంగా గొప్పది ? అంటే, తెలిసి పాపం చెయ్యటం పశువులో లేదు. అన్నీ తెలిసి పాపం చేస్తాడు మనుష్యుడు. కాబట్టి ఒక్కొక్క చోట ఒక్కొక్క జీవుడు, పూర్వజన్మల్లో ఎన్నిపాపపుణ్యాలు చేసినా, పశువు శరీరంలోకి వెళ్ళి అక్కడ నుంచి ముక్తి పొందిన జీవులు కూడా ఉన్నారు. ఆ జన్మలో పుట్టినదా అది– దెబ్బలు తినడం, బరువులు మోయడం, ప్రజలిచ్చే ఇంతగడ్డి తిని వాళ్ళకి పాలివ్వడం, సేవచేయడం; సేవచేయడంలోనే శరీరం అంతా అర్పించినటువంటి స్థితి. ఆ జన్మలో అతడికి ఆ కర్మ ఉన్నది కాబట్టి, పూర్వకర్మలను పశుశరీరంలో కష్టాల రూపంలో అనుభవించాడు కాబట్టి, ఆ జీవుడిని తనలోకి తీసుకోవటం అనేటటువంటి అనుగ్రహం అమ్మకు దానియందు కలిగింది.

మనమంతా ఉపాసన చేస్తాం, మంత్రోపాసన చేస్తాం. భగవంతుణ్ణి అడుగవలసినటువంటిది తరుణోపాయం. ‘అడిగితేనే చెప్తాను’ అనేవాడు గురువు. అడగకుండపానే “నేనున్నాను. నన్ను చూస్తే మీకు ఏది అడగాలో తెలుస్తుంది” అని చెప్పగలిగినటువంటి వాళ్ళు అంశలు. ఈ దేశంలోనే కాదు, విదేశాల నుంచి కూడా వచ్చి అనేక ఆశ్రమాల్నీ గురువుల్నీ అన్వేషిస్తూ ఆశ్రయిస్తూ అనేకులు తిరుగుతున్నారు; మోక్షోపాయం అడుగుతారు. ఒకరు మంత్రం చెపుతారు, ఒకరు యోగం చెపుతారు. వాళ్లు మార్గాల్ని ఇచ్చారు. ఆ మార్గమే ఈమె; ఉపదేశం కాదు తాను ఇచ్చింది– అదీ తేడా. ఆమెను గురువుగాకాదు, జగన్మాతగా చూడాలి. గురువులు ఏం చేస్తారు? జగన్మాతను ఉపాసించమని చెప్పేవారుండవచ్చు; ‘అక్కడికి వెడితే నీకు సిద్ధిస్తుంది’ అని చెప్తారు. కానీ ఫలం ఇచ్చేది అమ్మవారే. తానే అద్వైతే

! ఇక్కడ మార్గమే లేదు; గమ్యమే ఉంది. ఫలమే ఉంది కానీ ఉపాసన కూడా లేదు. ఇది విశేషమైనటువంటి అపురూపమైన స్థితి.

నేనూ, నాకుండే అల్పమైన పరిజ్ఞానంలో, చాలామందిమహాత్ముల చరిత్రలు చూశాను. పురాణాల్లో చూశాను. అనేకమంది ఎలా ఉన్నారు? ఏమి చేశారు - అని. కానీ ఇతఃపూర్వం అమ్మవంటి వ్యక్తి ఎక్కడా వచ్చినట్టు రికార్డులో లేదు. వచ్చి ఉండొచ్చు, తెలియదు. అపూర్వమైన స్థితి ఆమెది; విశేషమైన స్థితి. ఆమెకి మరణమేముంటుంది? దేహాన్ని వదలిపెట్టి తానక్కడ ఉంది. దేహంలో ఉంటే 'శీలేతి శరీరం' అని పేరు దానికి; రోజూ నశిస్తూంటుంది. వార్ధక్యం చేత, ధాతువుల పాడైపోతూ ఉంటాయి. ఆకలి దప్పులు ఎక్కువౌతాయి. అలాంటి శరీరధర్మాలు ఆమెకి ఉన్నప్పటికి కూడా, తన శరీర ధర్మాలను అతిక్రమించి తాను నిత్యం యోగిగా, యోగినిగా ఉండగలిగిన శక్తి ఉన్నప్పటికీ కూడా అలాంటి ప్రయత్నం యత్కించిత్ కూడా చేయలేదు. "నేను ఎక్కడి పోతాను. శరీరం కదా పోతుంది. నేను ఇక్కడే ఉంటాను" అన్నది. ఆమెకి తెలుసు, ఆమెను తెలిసినవాళ్ళకి తెలుసు.

ఆమె పట్ల మన కర్తవ్యం : ఆమెకి మనం భక్తులమే అయితే, ఇతరులు, ఆమె దగ్గరకి వెళ్ళి అర్థించి ఫలం పొందేటటువంటి ప్రచారం ఏమన్నా చేయగలిగితే చేయటం మన ధర్మం. దానివల్ల ఒక భక్తుడు ఇంకొక వ్యక్తిలో భక్తిని మళ్ళీ వెలిగించేటట్టు -ఒక దీపం వెయ్యి దీపాలను ఏ విధంగా వెలిగిస్తుందో తాను మాత్రం అందులో ఏమీ ఖర్చు కాకుండా తాను తానుగానే ఉండి - భక్తి ప్రచారం, భక్తితో పాటు సత్ప్రవర్తన యొక్క ప్రాశస్త్యం అర్థం అయ్యేటట్టు చెప్పటం; ఆర్తిలో ఉన్నపుడు 'ఈశ్వరు డెక్కడున్నాడు? ఏ రూపంలో ఉన్నాడో మీకు తెలుసా?" అంటే "ఇక్కడ అమ్మ ఉంది. వెళ్లు. ఆర్తితో అడుగు" అని చెప్పటం మన ధర్మం.

చాలా ఆశ్రమాలు, అనేక పెద్ద గ్రంథజాలం (Publications) చాలా ఎక్కువగా ఉన్నటువంటి దేశకాల పరిస్థితులు ఇవి. ఆయా మార్గాల్లో ఉండేవారికి ఆయా ఫలాలు వస్తూండవచ్చు. నా అభిప్రాయంలో - మనం విశ్వాసాన్ని కల్పించలేము. కానీ 'నాకు ఇది జరిగింది' అని చెప్పగలిగిన వాడు ఆదర్శాన్ని

ఇతరులకు చూపించ గలుగుతాడు. 'ఇది నా అనుభవం' – అని చెప్పడమే మన కర్తవ్యం. దానివల్ల ఉపకారం జరుగుతుంది. ఒకరు చెప్తే ఇంకొకరు వినడం అనేది వాళ్ళిద్దరి మధ్య ఉండే బాంధవ్యాన్ని బట్టి హెచ్చు తగ్గుల్ని బట్టి ఉంటుంది. నీ మాట ఎవరైతే వింటారో వాళ్ళకి చెప్పాలి. నీ వాక్యం నీ అనుభవం ఎవరికి ప్రామాణికమో వాళ్ళకి చెప్పటం ధర్మం.

నేడు మతాల పేరుతో సిద్ధాంతాల పేరుతో ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం ... వీటికి ప్రాధాన్యత వచ్చింది. జ్ఞానము, తపస్సు, యోగము, సత్త్వగుణంతో జీవించటం కంటే ఈ మార్గాలు, సిద్ధాంత భేదాలు ....కి ఎక్కువ ప్రచారం కలిగిందీ రోజు. సిద్ధాంత భేదాల్ని ప్రచారం చేసిన వాళ్ళు ఎవరూ కూడా తన మార్గంలో ఇంకొక పది మందిని చేర్చుకోవచ్చు. గానీ తరుణోపాయం చూపించటం కాదది. అంటే – మతప్రచారం లాంటి స్థితిలో మనం ఉన్నాం. ధర్మప్రచారం కావాలి, భక్తి ప్రచారం కావాలి. సిద్ధాంత ప్రచారం వల్ల వాళ్ళు missionaries క్రింద లెక్క. అంతే. ఏ సిద్ధాంతమైనా కావచ్చు. ఏదైనా సరే Christianity కావచ్చు, Islam కావచ్చు, వైష్ణవం కావచ్చు, శైవం కావచ్చు, నాసితకత్వం కావచ్చు, అద్వైతం కావచ్చు – missionary activity ఎక్కువగా ఉందని, దానివల్ల దేశంలో సమాజానికి సమైక్యత బదులు అనైక్యత పెరుగుతుంది. దానివలన మనం ఎవరినీ ఉద్ధరించలేము.

వెళ్ళి అమ్మను వేడుకో" "అమ్మా! నన్ను అనుగ్రహించు శ్రీమాత్రే నమః" అంటే చాలు. 'అమ్మకు నమస్కారము' ఆ మంత్రమే మహామంత్రం. ఆ మార్గంలో అమ్మ ఆరాధన; అంతేకాక మన మనస్సులో ప్రార్థన చేయడం చేత ఫలితాలు వస్తయ్. 'ఓ అమ్మా! నువ్వు విశ్వాసం లేని వాళ్ళకి విశ్వాసాన్ని ఇవ్వు. కష్టం ద్వారా దుఃఖం కలిగిన వాళ్ళని నీదగ్గరికి చేర్చుకో. సమాజం సమైక్యతతో జీవించే మార్గాన్ని మాకు చూపించు. నీ యొక్క విశ్వప్రేమ, మాతృత్వం మాకు అవగాహన అయ్యేటట్లు మాకు అనుభవాల్ని ఇయ్యి" అని అడగటం మన కర్తవ్యం.

అమ్మ గుప్పెడు అన్నం చేతిలో పెట్టిందంటే, తిన్నవాడికి తెలియకుండానే జీవుడిని ఆశ్రయించి ఉన్న పూర్వజన్మ సంస్కారములు నాశనం అవుతాయి. 'ప్రసాదము' అని దానికి పేరు. ప్రసాదం అంటే - పులిహోర, పాయసం అని కాదు. ప్రసాదం అంటే 'దయ' అని అర్థం. ప్రసాద గుణం - వాత్సల్యం, ప్రేమ, ఆశీర్వచనం. ఆమె ప్రసాదం నిజమైన ప్రసాదం. అన్నం కాదది; ప్రసాదం. అది తిన్నవాళ్ళకి అనేక అనుభవాలు కలిగినాయి.


నాకు అమ్మతో వ్యక్తి గత పరిచయం ఉన్నది. నా భార్యని ఇంటికి రమ్మని ఆదరించి, చాలా దయ చూపించారు. జబ్బుగా ఉన్నపుడు ఆమె హైదరాబాద్ వచ్చారు. నేను, నా భార్య వెళ్ళి చూశాం. నా చెయ్యి తన చేత్తో పట్టుకున్నారు. నేను ఆమె చెయ్యి పట్టుకుని నాడి అదీ చూసి 'ఆరోగ్యం ఎలా ఉన్నారమ్మా మీరు?' అని అడిగాను. నవ్వారు. 'ఒక ప్రార్థన - మీరు ఉండాలి' అన్నాను. 'ఎంతకాలం వీలు అవుతుందో, మీకు ఎంత శ్రమ అయినప్పటికీ, ఈ శరీరంలో ఉండటం ఎంత బాధాకరం అయినప్పటికీ. లోకం మీద మీకు ఉండేటటువంటి దయ ముందు, మీకు ఉండేటటువంటి బాధ అంత గొప్పది కాదు. వీలైనంతకాలం ఉండాలి' అన్నాను. అక్కడ ఒక lady doctor, personal attendant ఒకామె ఉన్నది. ఆమెని చూస్తూ "వీళ్ళు డాక్టర్లంతా ఏదో చేస్తున్నారు - నన్ను కాపాడగలరా ఎవరైనా? నేను ఉండాలంటే ఉంటాను, వెళ్ళాలంటే వెళ్ళిపోతాను. నాన్నా!

కొంతకాలం ఉండాలని నువ్వు అంటున్నావు. ఉంటే - అపసవ్యాలేవైనా జరిగితే? అది ఫరవాలేదా?" అన్నారు. 'నీకు సవ్యం లేదు, అపసవ్యం లేదు. ఎవరి ముందు వెనుకలు ఎక్కడ జరిగినా నీ దగ్గరకే వస్తారు. కాబట్టి మిమ్మల్ని ఆశ్రయించిన తర్వాత ఆ జీవులు వాళ్ళ కర్మానుసారంగా ఎక్కడికిపోవడం, ఇంకో జన్మ ఎత్తడం అలా ఉండదు కదా! మీ దగ్గరకు వచ్చి, మిమ్మల్ని ఆరాధించి మీతోసహజీవనం చేసి, మీ చేతి ప్రసాదం తిని మిమ్మల్ని నమ్ముకున్న వాళ్ళు మీ దగ్గరకి వస్తారు. కానీ ఇంకొక చోటికి పోరు. కాబట్టి ఉండండి' అన్నాను. అంతే. మళ్ళీ చూడలేదు. "మళ్ళీ చూడటానికి వీలుండదు. చూసుకో నాయనా! లోపల" - ఒకటే మాట. నా భార్యను పిలిచి, బొట్టు పెట్టి చీరిచ్చారు.

ఆమె ఆశీర్వచనం, ప్రేమే, అనురాగమే మహదాశీర్వచనం. వరాలు రాక్షసులు కూడా తపస్సు చేసి పొందారు. భగవంతుడి సాక్షాత్కారం అయి, వరాలు పొందితే జ్ఞానం కలిగిందా వాళ్ళకి ? లోక కంటకులయ్యారు; నశించారు. కాబట్టి ఒకరూపంలో భగవంతుడిని గూర్చి తపస్సులు చేయడం, వరాలు పొందడం మాత్రానికి ఉన్నత స్థానం మన సంస్కృతిలో లేదు. జ్ఞానం కోసం తపస్సులు చేసిన వాళ్ళు లోకాన్ని అనుగ్రహించారు. శక్తి నాకు కావాలి, అందరినీ జయించాలి - అని కోరికన వాళ్ళు పోయారు. కాబట్టి భగవంతుడు కనబడితే ఏం అడగాలి? అది చెప్పే వాడే గురువు. ఏది అడగాలో ఏది అడగకూడదో చెప్పేవాడు గురువు; ఇచ్చేవాడు ఈశ్వరుడు. ఇతడు conduct regulate చేసే వాడు; ఇచ్చేవాడు ఈశ్వరుడు. అది అభేదం.

ఆమె గురువు, దైవం ఏకకాలంలోనే.

(శ్రీ శైవపీఠాధిపతులు, మహామహోపాధ్యాయ, పరమపూజ్య శ్రీశ్రీశ్రీ సద్గురు శివానన్దమూర్తిగారు 10.6.15 తేదీన శివసాయుజ్యం పొందారు. సో॥శ్రీ గంటి కాళీప్రసాద్ గారి సౌజన్యంతో తీసిన Youtube లోని Video ఆధారంగా అమ్మను గురించి వారు చేసిన ప్రసంగ భాగాన్ని అందిస్తున్నాము. సజల నయనాలతో శ్రీ శివానన్దమూర్తి గారి శ్రీ చరణాలకు సహస్ర వందనములర్పిస్తున్నాము.)





జనానందమూర్తి

ఒక వంక ముఖములో నొప్పెడు శాంతంబు
దరిచేరువారి బాధలను దీర్ప
ఒక వంక పెదవిపై నొప్పెడు చిరునవ్వు
ఆశ్రితులకు ఇంత అండకాగ
ఒక వంక నాల్కపై నొల్కెడు వాక్కులు
సంశయమ్ములు దీర్చు శాస్త్రమనగ
ఒక వంక నమ్మికనున్న శిష్యులకెల్ల
తృప్తి కూర్చెడి గురుదేవుడనగ
ఒకట వినయమ్ము రూపమై ఉన్నదిచట
ఒకట విజ్ఞాన విలసన నొప్ప నిచట
నడచుచున్నట్టి ఒక జనానందమూర్తి
శ్రీ శివానందమూర్తియై చెలగునెపుడు

పురుషోత్తమపుత్రభార్గవ

పి.యస్.ఆర్. ఆంజనేయప్రసాద్



సద్గురు శ్రీ శివానందమూర్తి

జగమెరిగిన బ్రహ్మజ్ఞాని, సర్వసంగపరిత్యాగి, ముద్దకట్టిన సత్యమూర్తి, త్రికాలవేది, సర్వజ్ఞుడు, మహామహిమాన్వితుడు, మహాయోగి అయినా అతి సామాన్యునిగా మెలగే మహామనీషి సద్గురు శివానందమూర్తి గారు.

మంత్రవేత్త, తత్త్వవేత్త, శాస్త్రవేత్త, సాహితీవేత్త, సద్గురు శివానందమూర్తి గారు అచ్చమైన మానవతావాది. అదర్శపౌరుడు, అదర్శగృహస్థు, బహుముఖీన వ్యక్తిత్వం, పారమెరుగని దివ్యత్వం, ఊహకందని మూర్తిమత్వం శ్రీ శివానందుల సొంతం.

నిరంతర అధ్యయనశీలి అయిన గురుదేవులు కఠోపనిషత్‌పై రచించిన "కఠయోగం" పీఠాధిపతుల ప్రశంసలు పొందింది. సాంస్కృతిక వ్యాసాలు 'భారతీయత', 42మంది మహర్షులపై రచించిన "మార్గదర్శకులు మహర్షులు", విష్ణుసహస్రనామాలపై చేసిన వ్యాఖ్య 'భీష్మబోధ', ఆంగ్లంలో ఇండోనేషియా మీద వ్రాసిన వ్యాసాలు 'సువర్ణభూమి', ఎడ్యుకేషన్ సిస్టమ్ మీద వ్రాసిన వ్యాసాలు లోక ప్రశస్తి పొందాయి. 'గౌతమబుద్ధ' అనే చిత్రానికి వీరు వ్రాసిన కథ, స్క్రీన్‌ప్లే లకు రాష్ట్రప్రభుత్వ 'నంది పురస్కారం' దక్కింది. 'వాణి' అనే కలం పేరుతో కొన్ని కవితలు కూడా చిన్నప్పుడు వ్రాశారు. భవిష్య భారతతరాలకు వీరి రచనలు అక్షయనిధులు.